Follow: @ANNTELUGU

07-09-2026

ANN తెలుగు

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 239 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక పరిణామం

- విదేశాలకు మీనాక్షి నటరాజన్
- ఈనెల 13న లండన్‌కు రాష్ట్ర ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్
- 10 నెలల పాటు పార్టీ వ్యవహారాలకు మీనాక్షి దూరం
- తెలంగాణకు కొత్త ఇన్ ఛార్జి వచ్చే అవకాశం
- సచిన్ సావంత్ కే బాధ్యతలు అప్పగిస్తారా? దీపాదాస్ మున్షీ లేదా మాణిక్ ఠాగూర్ లలో ఒకరు వస్తారా?

హైదరాబాద్, మహా : తెలంగాణ కాంగ్రెస్ లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జిగా, ఏఐసీసీ కార్యదర్శిగా ఉన్న మీనాక్షి నటరాజన్ పది మాసాల పాటు రాజకీయాలకు దూరంగా ఉండనున్నారు. రాజ్యసభ స్థానాన్ని రెప్పపాటులో కోల్పోయిన మీనాక్షి నటరాజన్ ఇంతకాలం తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల్లో కీలకంగా పనిచేశారు. ఈనెల 13 నుంచి లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో 10 నెలల కోర్సు చేసేందుకు మీనాక్షి వెళ్తున్నారు. దీంతో పదినెలల పాటు ఏఐసీసీకి దూరంగా ఉండనున్నారు. ఈ క్రమంలోనే మీనాక్షి స్థానంలో కొత్త ఇన్ ఛార్జి వచ్చే అవకాశముందన్న చర్చ ఢిల్లీలో జరుగుతోంది. తెలంగాణ కాంగ్రెస్ పై మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్



### రాహుల్ గాంధీనే ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థి

- కేసీ వేణుగోపాల్
- ఎవరూ గందరగోళ పరిస్థితుల్ని సృష్టించవద్దు

03



### మహేష్ గౌడ్‌కు సీఎం రేవంత్ అభినందనలు

టీపీసీసీ చీఫ్‌గా రెండేళ్ళు

02



### డీజీపీ సీవీ ఆనంద్ పై కవిత ఫైర్

- మీ కోడళ్లకు ఇలాగే కామెంట్స్ పెడితే ఊరుకుంటారా?

02



## కేసీఆర్ రాజీనామా చెయ్

### గజ్వేల్ సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించవా?

- ప్రతిపక్షనేత హోదా ఇస్తే ఫాంహౌజ్ లో నిద్రపోతావా?
- కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలనపై చర్చకు రెడీ
- డేట్ ప్లేస్ టైమ్ చెప్పు కేసీఆర్
- ఇందిరాపార్క్ వద్ద కాంగ్రెస్ మహా ధర్నాలో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సవాల్
- పదేళ్ళు ఉద్యోగాలు ఇవ్వకుండా యువతను రెచ్చగొడతారా?
- కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సలహాలు సూచనలు ఇవ్వాలి
- ప్రతిపక్ష నేత గౌరవం కాపాడుతాం
- తెలంగాణ శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, మహా : కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు, పదేళ్ల పాలనకు తేడాపై చర్చకు సిద్ధమా? అని బీఆర్ఎస్ నేతలకు టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సవాల్ చేశారు. గులాబీ పార్టీ నేతలు ఎక్కడంటే అక్కడ చర్చ చేద్దామని ఛాలెంజ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నాయకుడు ప్రజాధనతో జీతాలు తీసుకొని అసెంబ్లీ సమావేశాలకు రాకపోవడమేంటని కాంగ్రెస్ మండిపడింది. కేసీఆర్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయలని డిమాండ్ చేస్తూ అధికార కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు దగ్గర మహాధర్నా నిర్వహించింది. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ , ప్రభుత్వ సలహాదారు వీహెచ్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ముఖ్య నేతలు జగ్గారెడ్డి, మధుయాస్కీ సహా అనేకమంది పాల్గొన్నారు.

మిగతా 2వ పేజీలో

### నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

కేసీఆర్ రాజీనామా డిమాండ్ నేపథ్యంలో వాడివేడిగా సమావేశాలు

02







## బూతుపురాణం వినేందుకు అసెంబ్లీకి రావాలా?

### నా చావును కోరుకుంటూ పదేపదే మాట్లాడుతున్నారు

- పాలన చేతకాక చిల్లర మాటలేంది?
- బీఆర్ఎస్ ఎల్పీ సమావేశంలో కేసీఆర్
- అసెంబ్లీ సమావేశాలను ఆషామాషీగా తీసుకోవొద్దని పిలుపు
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తా
- కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టుల కోసం లక్షలాదిమందితో ఆందోళన చేస్తా
- నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది.. సిద్దంగా ఉండండి

గజ్వేల్, మహా : కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన డిజాస్టర్, అట్టర్ ఫ్లాప్ అని మాజీ సీఎం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శించారు. కేసీఆర్ అధ్యక్షతన సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో ఆ పార్టీ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై బీఆర్ఎస్ నేతలతో ఆయన చర్చించారు. బీఆర్ఎస్ కార్యాచరణపై ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. తమ ప్రభుత్వం పోవడం ఖాయమని కాంగ్రెస్ నేతలకు అర్థమైందన్న కేసీఆర్ , అందువల్లనే అడ్డగోలు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. పాలన చేతకాకే సీఎం రేవంత్ రెడ్డి అభ్యంతరకరంగా బూతుపురాణం చేస్తున్నారని, అలాంటి వారితో చర్చలకు అసెంబ్లీకి రావాలా? అని నిలదీశారు. తన చావు కోరుతూ పదేపదే స్పీచ్‌లు ఇస్తున్నారని, అసెంబ్లీకి రావాలని ధర్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**నియోజకవర్గాల పునర్విభజన పక్కా**

కృష్ణా, గోదావరి నదీ జలాల అంశంపై ఉధృతమైన పోరాటం చేయాలని బీఆర్ఎస్ సభ్యులకు

మిగతా 3వ పేజీలో



## డిప్యూటీ సీఎంతో అసంపూర్తిగా ముగిసిన చర్చలు

**యథావిధిగా ఉద్యోగ సంఘాల 'చలో హైదరాబాద్'**

హైదరాబాద్, మహా : రాష్ట్రంలో ఉద్యోగ సంఘాల డిమాండ్లు, ఆందోళనల నేపథ్యంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో ఉద్యోగ సంఘాల నేతలు జరిపిన చర్చలు అర్ధాంతరంగా ముగిశాయి. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలు, ఉద్యోగుల వివిధ డిమాండ్లపై చర్చించేందుకు ప్రభుత్వం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. అయితే, ఈ భేటీలో భాగంగా ఆందోళనలను విరమించాలని ఉద్యోగ సంఘాల ప్రతినిధులను మంత్రి భట్టి విక్రమార్క కోరారు. అయితే, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ రాలేదనే భావనతో ఉద్యోగ సంఘాలు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశాయి. ఈనెల 10న తలపెట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

### టీపీసీసీపై మహేష్ కుమార్ గౌడ్ మార్క్ రెండేళ్ళ ప్రస్థానం అద్వితీయం


03



## ప్రజల ఆశలు నెరవేర్చండి

- రియల్ ఎస్టేట్ వ్యాపారులవి కాదు!
- బుగ్గపాడు భూముల కేటాయింపుపై ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలి.
- కేరళ ఎక్స్‌ప్రెస్‌కు ఖమ్మంలో స్టాపేజ్ కోసం కేంద్రం దృష్టికి.
- మధిర ఇంజినీరింగ్ కళాశాలకు కేంద్ర సహకారం కోరాం.
- బీజేపీ జాతీయ నాయకులు ,తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల కో ఇన్చార్జి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి.

02



## ఇజ్రాయెల్‌పై ఇరాన్ భారీ కుట్ర

- 'అక్టోబర్ 7' తరహా దాడికి ప్లాన్

02



### తెలంగాణ విమోచన జైత్రయాత్రకు బ్రేక్

- బీజేపీ బైక్ ర్యాలీకి పోలీసుల నో.
- బాలాపూర్ నుంచి చార్మినార్ వరకు ర్యాలీకి అనుమతి నిరాకరణ.
- నేతల అరెస్టులపై బీజేపీ ఆగ్రహం. కాంగ్రెస్ హిందువులను అణచివేస్తోందని ఆరోపణ.

03

# తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక పరిణామం

( మొదటి పేజీ తరువాయి )

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తిరుగులేని పట్టు ఉండగా, హైకమాండ్ కూడా సీఎం రేవంత్ మాటకే మద్దతుగా నిలుస్తోంది. మీనాక్షి నటరాజన్ లండన్ వెళ్తున్న క్రమంలో తెలంగాణకు పూర్తిస్థాయి కొత్త ఇన్ ఛార్జిని నియమిస్తారా? ప్రస్తుతం కో ఇన్ ఛార్జిగా ఉన్న సచిన్ సావంత్ కే తాత్కాలిక ఇన్ ఛార్జి బాధ్యతలు అప్పగిస్తారా? అన్నది చూడాల్సి ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్ళు పూర్తవుతున్న నేపథ్యంలో ఎన్నికల వ్యూహంతో త్వరలో కొత్త ఇన్ ఛార్జిని నియమించే అవకాశం కనబడుతోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కీలకంగా పనిచేసిన మాణిక్ ఠాగూర్ లేదా కేరళ ఇన్ ఛార్జిగా వ్యవహరిస్తున్న దీపాదాస్ మున్షీలలో ఒకరిని తెలంగాణ కు తీసుకువచ్చే అవకాశముందన్న చర్చ కూడా జరుగుతోంది. ఈ వారంలో దీనిపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

## నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

**కేసీఆర్ రాజీనామా డిమాండ్ నేపథ్యంలో వాడివేడిగా సమావేశాలు**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం పది గంటలకు ఉభయసభలు మొదలవుతాయి. ఇప్పటికే సమావేశాల నిర్వహణకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసు యంత్రాంగంతో పాటు ప్రభుత్వ యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా జరిగేట్లు చర్యలు తీసుకుంది. ఈ వర్షాకాల సమావేశాల్లో పలు కీలక బిల్లులు ప్రవేశపెట్టడంతో పాటు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు ముఖ్యమైన సమస్యలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు, ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు విపక్షాలు కూడా సిద్ధమవుతున్నాయి. దీంతో ఈసారి వర్షాకాల సమావేశాలు వాడీవేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, కొత్త బిల్లుల ఆమోదం లాంటివి ప్రభుత్వ అజెండాగా ఉండే అవకాశం ఉంది. ఓవైపు కేసీఆర్ బీఆర్ఎస్ ఎల్పీ సమావేశం నిర్వహించి ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేయగా, సీఎం రేవంత్ రెడ్డి అందుబాటులో ఉన్న ఎమ్మెల్యేలతో ఇప్పటికే మాట్లాడారు.





# కేసీఆర్ రాజీనామా చెయ్

( మొదటి పేజీ తరువాయి )




ఈ ధర్నాలో మహేశ్ గౌడ్ పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నేత కీలకమని మహేశ్ గౌడ్ వెల్లడించారు. తమది ప్రజల కోసం ఆలోచించే ప్రభుత్వమని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణపై చేసిన అప్పును మోస్తూనే సంక్షేమం, అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. తాము ఇస్తున్న సంక్షేమం ఇతర రాష్ట్రాలు కూడా ఇవ్వడం లేదని చెప్పారు. ధనికులు తినే సన్న బియ్యాన్ని తాము పేదవారికి ఇస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డుల కోసం లక్షల్లో అప్లికేషన్లు వస్తే.. వేలల్లో కూడా కేసీఆర్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన వైఫల్యాలను, కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై చర్చించేందుకు తాము సిద్ధమేనని డేట్, ప్లేస్, టైమ్ చెప్పాలని కేసీఆర్‌కు మహేశ్‌కుమార్ గౌడ్ సవాల్ విసిరారు.

**చదువు కంటే సంస్కారం ముఖ్యం**

కేటీఆర్ చదువుల విషయంలో వ్యంగంగా మాట్లాడుతున్నారని మహేశ్ గౌడ్ ధ్వజమెత్తారు. చదువు కంటే సంస్కారం ముఖ్యమని అన్నారు. చదువుకున్న కేటీఆర్ తెలంగాణకు ఏం చేశారు? అని ప్రశ్నించారు. తమ సీఎం, ఐటీ మంత్రి కోట్లాది రూపాయల పెట్టుబడులు తీసుకువస్తున్నారని తెలిపారు. కేసీఆర్ తన కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చారని చెప్పారు. ఉద్యమకారులకు గౌరవం ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. గద్దర్, అందెశ్రీలను గౌరవించామని తెలిపారు. పూలే విగ్రహాలను హైదరాబాద్ నడిఒడ్డున పెట్టామని వెల్లడించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని తాము ఏర్పాటు చేశామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియాతో కేటీఆర్ క్షణికానందం పొందవచ్చు. కేసీఆర్‌కి ఇచ్చిన హోదాను విస్మరించడం తప్పు. కేంద్రాన్ని విమర్శిస్తే దేశ ద్రోహి అంటారా?. కేసీఆర్‌కి గౌరవంతో చెబుతున్నాం. కేసీఆర్ అసెంబ్లీలో చర్చకు రావాలి. మా తప్పులను వెలికి తీయండి. కేసీఆర్ బయటకు రారు. కేటీఆర్, హరీశ్‌రావు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. ప్రపంచంతో హైదరాబాద్ పోటీ పడాలన్నది మా ధ్యేయం. మీనాక్షి నటరాజన్ నిప్పులాంటి మనిషి. నీతినిజాయితీ గల మనిషి మీనాక్షి. ఆమెకు రాజ్యసభ సీటు ఇస్తే దాన్ని దొంగలించారు. బీజేపీ, బీఆర్ఎస్ అధికారంలోకి వస్తామని కలలు గంటున్నాయి' అని మహేశ్ గౌడ్ ఎద్దేవా చేశారు.

**సభకు వచ్చి సూచనలు ఇవ్వాలి**

పదేళ్లు సీఎంగా పని చేసిన కేసీఆర్ సభకు వచ్చి వారి అనుభవాన్ని పంచుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కేసీఆర్ శాసనసభకు రాకుండా ఫాంహౌస్‌కే పరిమితం అయ్యారని నిరసిస్తూ ఇవాళ హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మహా ధర్నా'లో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలతో రోడ్లపై మాట్లాడించడం కాదని సభకు వస్తే సమాధానం చెప్తామన్నారు. కేసీఆర్ వైఖరి మారకుంటే మరో పదేళ్లు కూడా వాళ్లు రోడ్ల మీదనే ఉంటారన్నారు. విపక్షాలు సోషల్ మీడియాలో చేస్తున్న విషప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ జవాబుదారీతనంతో పని చేస్తోందని అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఆర్టీసీ బస్సులో కాంగ్రెస్ కార్యకర్తలు మాత్రమే ఉచిత ప్రయాణం చేస్తున్నారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పేదలకు రేషన్ కార్డు కూడా ఇవ్వని దౌర్భాగ్య పాలన పదేళ్ల పాటు సాగిందని ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్న అంశాలను పదేళ్ల పాటు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రేషన్ కార్డులు ఇస్తున్నామన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలకు రేషన్ కార్డు రాలేదా? సన్న బియ్యం తీసుకోవట్లేదా అని ప్రశ్నించారు. పదేళ్లు ఉద్యోగులు ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసిన బీఆర్ఎస్ ఇప్పుడు యువతను రెచ్చగొడుతోందని మండిపడ్డారు.



## ఇజ్రాయెల్‌పై ఇరాన్ భారీ కుట్ర

**హా**: 2023 అక్టోబర్ 7న హమాస్ జరిపిన విధ్వంసం కంటే మరింత భయానకమైన రీతిలో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడేందుకు ఇరాన్ ప్రణాళికలు రచిస్తోంది. తన అనుబంధ సాయుధ బలగాలు, ప్రాక్సీ గ్రూపులన్నింటినీ ఏకం చేసి "యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్" పేరుతో ఒకేసారి అన్ని వైపుల నుంచి ఇజ్రాయెల్‌ను దెబ్బకొట్టేందుకు ఇరాన్ భారీ కుట్ర పన్నుతోంది. ఈ మేరకు ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ వర్గాల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అమెరికాతో కలిసి దాడులకు పాల్పడి తమ దేశాధినేతల మరణానికి కారణమైన వారిని అంతం చేస్తామని పలుమార్లు హెచ్చరించిన ఇరాన్ ఆ దిశగా వ్యూహాలు రచిస్తున్నట్లు ఇజ్రాయెల్ నిఘా వర్గాలు తెలిపాయి. ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని ఇరాన్ ఎదురు చూస్తున్నట్లు వెల్లడించాయి. తమ దేశంపై భారీ స్థాయిలో దాడులు చేపట్టడానికి ఇరాన్ ప్రణాళిక రచిస్తున్నట్లు పేర్కొన్నాయి. ఇజ్రాయెల్‌కు చెందిన జెరూసలెం పోస్ట్ కథనం ప్రకారం, ఇరాన్ తన రివల్యూషనరీ గార్డ్స్ పర్యవేక్షణలో లెబనాన్‌లోని హెజ్‌బొల్లా, యెమెన్‌కు చెందిన హూతీలు, గాజాలోని హమాస్‌తో పాటు ఇరాక్, సిరియాలోని ఇరాన్ మద్దతు ఉన్న మిలీషియా గ్రూపులను ఒకే వేదికపైకి తీసుకొచ్చింది. 2023 అక్టోబర్ 7 దాడి సమయంలో సరైన సమన్వయం లేకపోవడం వల్ల హమాస్ కేవలం సరిహద్దు దాడులకే పరిమితమైందని గుర్తించిన ఇరాన్, ఈసారి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఒకే నిమిషంలో అన్ని వైపుల నుంచి విరుచుకుపడేలా బ్లూప్రింట్ సిద్ధం చేసింది. ఇజ్రాయెల్‌పై ఉత్తర, దక్షిణ తూర్పు సరిహద్దుల నుంచి ఏకకాలంలో దాడికి ఇరాన్ యత్నిస్తోందని ఇజ్రాయెల్ నిఘా వర్గాలు తెలిపాయి. జులైలో హమాస్ అత్యున్నత నాయకుడిగా ఎన్నికైన ఖలీల్ అల్‌హయ్యాకు ఇరాన్‌తో మంచి సంబంధాలు ఉన్నాయి. దీంతో ఇజ్రాయెల్‌పై పగ తీర్చుకోవడానికి ఇరువురు ఏకమైనట్లు నిఘా వర్గాలు తెలిపాయి. గతంలో అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో దెబ్బతిన్న తమ సైనిక సామర్థ్యాన్ని ఇరాన్ వేగంగా పునరుద్ధరించుకుంటోంది. క్షిపణులు, డ్రోన్ల ఉత్పత్తిని వేగవంతం చేయడానికి, దెబ్బతిన్న అణు సామర్థ్యాలను పునరుద్ధరించడానికి ఇరాన్ ప్రయత్నిస్తోంది. ఐఆర్‌జీసీకి చెందిన 'ఖుద్స్ ఫోర్స్' ఉన్నతాధికారులు హెజ్‌బొల్లా, హూతీ కమాండర్లతో నిరంతరం కాన్ఫరెన్స్ కాల్స్, సమావేశాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఇజ్రాయెల్‌ను నలువైపులా దిగ్బంధించి ఆర్థికంగా, సైనికంగా కోలుకోలేని దెబ్బతీయడమే ఇరాన్ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ఇరాన్ తన ప్రాక్సీ గ్రూపులతో సమన్వయం పెంచుకుంటున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ రక్షణ దళాలు తీవ్ర హెచ్చరికలు జారీ చేశాయి. ఉత్తర, దక్షిణ సరిహద్దుల్లో ముప్పు పెరుగుతుండటంతో ఇజ్రాయెల్ సైన్యం కూడా అత్యున్నత అలర్ట్ ప్రకటించింది.

## మహేష్ గౌడ్‌కు సీఎం రేవంత్ అభినందనలు

**హైదరాబాద్, మహా :** సామాన్య కార్యకర్త నుంచి పార్టీ రాష్ట్ర రథసారథి వరకు ఎదిగి... పీసీసీ అధ్యక్షులుగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బీసీ బిడ్డకు తెలంగాణ కాంగ్రెస్ పగ్గాలు అప్పగించిన నిర్ణయం...కేవలం ఒక పదవిని అప్పగించడం కాదు, సామాజిక న్యాయంపై కాంగ్రెస్‌కు ఉన్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఆ బాధ్యతను స్వీకరించిన నాటి నుంచి... ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో, రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో,పార్టీని బలోపేతం చేస్తూ, కార్యకర్తలకు అండగా నిలుస్తూ,మహేష్ కుమార్ గౌడ్ సాగిస్తున్న ప్రస్థానం అభినందనీయమన్నారు. ఇదే అంకితభావంతో ప్రజా సేవలో మరిన్ని మైలురాళ్లు మహేష్ కుమార్ గౌడ్ చేరుకోవాలని సీఎం ఆకాంక్షించారు.

# ప్రజల ఆశలు నెరవేర్చండి



**ఖమ్మం, మహా :** ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులని, వాటిని కేటాయించే ప్రతి సందర్భంలో ప్రజా ప్రయోజనం, యువతకు ఉపాధి, రాష్ట్రానికి ఆదాయం స్పష్టంగా కనిపించాలని బీజేపీ జాతీయ నాయకులు , కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సహ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులకు తాము వ్యతిరేకం కాదని, అయితే ప్రభుత్వ భూముల కేటాయింపులో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాలని, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆశలకు అనుగుణంగా వ్యవహరించకూడదని ఆయన అన్నారు.

ఖమ్మం జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, జిల్లా పదాధికారులతో కలిసి సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. బుగ్గపాడు మెగా ఫుడ్‌పార్క్‌కు సంబంధించిన భూముల కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు పూర్తి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీపక్ నెక్సెన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన అధికారిక పత్రాల్లో దాదాపు 72 ఎకరాల భూమి కేటాయింపు ప్రక్రియ కనిపిస్తుండగా, అనంతరం అగ్రిమెంట్ ఫర్ సేల్ పత్రాల్లో సుమారు 71.09 ఎకరాల విస్తీర్ణం నమోదైందని తెలిపారు. ఇదే సంస్థకు సంబంధించిన మరో ప్రాజెక్టు కోసం 11.47 ఎకరాలను 2029 జూన్ వరకు రిజర్వ్ చేయాలని ప్రభుత్వస్థాయి పత్రాల్లో పేర్కొన్నారని వివరించారు.

ఒక ప్రైవేట్ సంస్థకు పెద్ద ఎత్తున భూమి కేటాయించి, మరో 11.47 ఎకరాలను సంవత్సరాల పాటు రిజర్వ్ చేసి ఉంచడం చూస్తుంటే పరిశ్రమల అభివృద్ధి పేరుతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ ధోరణిలో వ్యవహరిస్తోందా అన్న అనుమానం ప్రజల్లో కలుగుతోందని సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

ఖమ్మం జిల్లాకు పరిశ్రమలు రావాలని, పెట్టుబడులు పెరగాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాలని, రైతులకు ప్రయోజనం చేకూరాలని తాము కోరుకుంటున్నామని సుధాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. అయితే పరిశ్రమల పేరుతో ప్రభుత్వ భూముల కేటాయింపులు జరిగేటప్పుడు ప్రతి అంశం పారదర్శకంగా ఉండాలని, ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని అన్నారు. డీపక్ నెక్సెన్ ప్రాజెక్టుకు సంబంధించిన పత్రాల్లో పెట్టుబడి, ఉపాధి అంచనాలకు సంబంధించి వేర్వేరు సంఖ్యలు కనిపిస్తున్నాయని సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఒక దశలో డీపీఆర్‌లో రూ.856.98 కోట్ల పెట్టుబడి ప్రతిపాదన ఉండగా, తరువాతి అగ్రిమెంట్‌లో రూ.515 కోట్ల ప్రాజెక్టు ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రక్చర్ కనిపిస్తోందన్నారు. ఉద్యోగాల అంచనాల్లోనూ మార్పులు ఉన్నాయని తెలిపారు. ఈ వ్యత్యాసాలకు సంబంధించిన సవరించిన డీపీఆర్‌లు, అనుమతులు, సాంకేతిక మదింపు వివరాలను ప్రభుత్వం ప్రజల ముందుంచాలని కోరారు.

ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడిలో ఇప్పటివరకు వాస్తవంగా ఎంత పెట్టుబడి వచ్చింది, ప్రాజెక్టులో ఎంత నిర్మాణం జరిగింది, ఎంత యంత్ర సామగ్రి వచ్చింది, స్థానిక యువతకు ఎంత ఉపాధి లభించింది, భూముల కేటాయింపులో ఎలాంటి మార్పుల ఉత్తర్వులు జారీ అయ్యాయనే వివరాలను ప్రభుత్వం సమగ్ర నివేదిక రూపంలో వెల్లడించాలని సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. భూముల కేటాయింపు నుంచి ప్రాజెక్టు పురోగతి వరకు అన్ని అంశాలపై ప్రజలకు పూర్తి వివరాలు అందుబాటులో ఉంచాలని కోరారు.

**ఖమ్మంలో కేరళ ఎక్స్‌ప్రెస్ స్టాపేజ్ కోసం ప్రయత్నాలు**

ఖమ్మం జిల్లా ప్రజల దీర్ఘకాలిక అవసరమైన కేరళ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఖమ్మంలో స్టాపేజ్ కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సుధాకర్‌రెడ్డి తెలిపారు. పలువురు ప్రయాణికులు, ప్రజలు ఈ అంశాన్ని తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో ఉన్న సమయంలో కేరళ ఎక్స్‌ప్రెస్ స్టాపేజ్ అంశాన్ని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఈ అంశంపై కేంద్ర రైల్వే మంత్రి కార్యాలయంలో అవసరమైన ప్రక్రియ ప్రారంభమైనట్లు తనకు సమాచారం ఉందని తెలిపారు. త్వరలోనే కేరళ ఎక్స్‌ప్రెస్‌కు ఖమ్మంలో స్టాపేజ్ లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఖమ్మం ప్రజల దీర్ఘకాలిక అవసరాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని చెప్పారు.

**మధిర ఇంజినీరింగ్ కళాశాలకు ఆధునిక హంగులు**

మధిరలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు నిర్ణయాన్ని సుధాకర్‌రెడ్డి స్వాగతించారు. ఈ కళాశాలను కేవలం సాధారణ ఇంజినీరింగ్ కళాశాలగా కాకుండా ఆధునిక సాంకేతిక విద్యకు కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రల్హాద్ జోషికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, అగ్రికల్చరల్ ఇంజినీరింగ్, రోబోటిక్స్, స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ వంటి ఆధునిక కోర్సులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరినట్లు సుధాకర్‌రెడ్డి వివరించారు.

**సేవా సంకల్ప అభియాన్‌లో ప్రజల భాగస్వామ్యం అవసరం**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవా ప్రస్థానం, దేశాభివృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో పార్టీ కార్యకర్తలతో పాటు అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సేవను కేవలం రాజకీయ కార్యక్రమంగా చూడకూడదని అన్నారు. సమాజంలోని చివరి వ్యక్తికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం చేరేలా చేయడం, యువతకు అవకాశాలు కల్పించడం, పేదలు, రైతులు, మహిళలకు అండగా నిలవడమే నిజమైన సేవ అని పేర్కొన్నారు. చివరిగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రభుత్వం నెరవేర్చాలని మరోసారి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూమి ప్రజల ఆస్తి అని, ప్రతి ఎకరం కేటాయింపులో ప్రజలకు ప్రయోజనం, యువతకు ఉద్యోగం, రాష్ట్రానికి ఆదాయం కనిపించినప్పుడే దాన్ని నిజమైన అభివృద్ధిగా పరిగణించగలమని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు, పాలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసిన అభ్యర్థి నున్నా రవికుమార్ , జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వర్రావు, జిల్లా కార్యదర్శి శ్రీరామ నేనిమణి, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ ఆల్లిక అంజయ్య, ఎండోమెంట్ జిల్లా కన్వీనర్ వీరభద్ర ప్రసాద్ , కుమిలి శ్రీనివాస్, రుద్ర గాని మాధవ్ , అంకిత పాపారావు, పిట్టల వెంకట నరసయ్య, వెంకన్న, గోపి , కోటి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు

# తుక్కుగూడ నర్సు హత్యాచార ఘటనపై సీఎం సీరియస్

**ఘటనపై మెజిస్టీరియల్ విచారణకు ఆదేశం.**
**భద్రతా లోపాలపై ఆరా.**
**ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ.**



**హైదరాబాద్, మహా :** తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సు హత్యాచారానికి గురైన ఘటనను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్రంగా పరిగణించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, బాధితురాలు ఉంటున్న వసతి ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లు, సంబంధిత సంస్థ యాజమాన్యం వైపు ఏమైనా నిర్లక్ష్యం జరిగిందా, మహిళా ఉద్యోగుల భద్రతకు సంబంధించి పాటించాల్సిన నిబంధనలు అమలయ్యాయా అనే అంశాలపై సమగ్రంగా విచారణ జరిపేందుకు మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించారు. బాధితురాలి కుటుంబానికి సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా కేసు దర్యాప్తును పకడ్బందీగా, వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కేసులో నిందితుడిని పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో దర్యాప్తులో ఎలాంటి లోపాలకు తావు లేకుండా చూడాలని సూచించారు.

ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను మెజిస్టీరియల్ విచారణలో పరిశీలించాలని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా ఘటనకు దారితీసిన పరిస్థితులు ఏమిటి? బాధితురాలు నివసిస్తున్న వసతి ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? మహిళా ఉద్యోగుల రక్షణకు అవసరమైన నిబంధనలు అమలయ్యాయా? సంస్థ నిర్వహణలో నిర్లక్ష్యం ఏమైనా ఉందా? వంటి అంశాలపై సమగ్రంగా విచారణ జరపాలని ఆదేశించారు. కేసు దర్యాప్తును అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని ముఖ్యమంత్రి పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. దర్యాప్తు ప్రక్రియతో పాటు ఫోరెన్సిక్ నివేదికలు, ఇతర సాంకేతిక ఆధారాల సేకరణను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమగ్ర ఆధారాలతో ఛార్జ్‌షీట్ దాఖలు చేసేలా పోలీసు ఉన్నతాధికారులు కేసును నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి త్వరితగతిన న్యాయం అందేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టేందుకు అవసరమైన చర్యలను వెంటనే ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. కేసు విచారణలో ఎలాంటి జాప్యం జరగకుండా న్యాయశాఖ, పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కేసు దర్యాప్తు నుంచి న్యాయస్థానంలో విచారణ వరకు ప్రతి దశలో అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సాంకేతిక, ఫోరెన్సిక్ ఆధారాలను పక్కాగా సేకరించి, న్యాయస్థానంలో కేసు బలంగా నిలిచేలా దర్యాప్తు సాగించాలని సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం తరపున మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ సీతక్క బాధిత కుటుంబాన్ని పరామర్శించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందించడంతో పాటు బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఘటనకు కారణమైన వ్యవస్థాపరమైన లోపాలను గుర్తించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. మహిళా ఉద్యోగుల భద్రతకు సంబంధించిన నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలని సూచించారు. ఒకవైపు నేరానికి పాల్పడిన నిందితుడిపై చట్టపరమైన చర్యలను వేగవంతం చేయడంతో పాటు.. మరోవైపు ఘటనకు దారితీసిన పరిస్థితులు, భద్రతా లోపాలు, సంస్థాగత నిర్లక్ష్యం వంటి అంశాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించడం ఈ కేసులో కీలకంగా మారింది. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా వీలైనంత త్వరగా విచారణ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎం మరోసారి స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఘటనకు కారణమైన వ్యవస్థాపరమైన లోపాలను సరిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

## మూడు ఏళ్లలో హామీలు అమలు చేయలేదు.. మరో రెండేళ్లు అడగడం అమానుషం

**సెప్టెంబర్ 10 చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి: దేవీప్రసాద్**

హైదరాబాద్, మహా: ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు మూడేళ్లు గడిచినా ఒక్క ప్రధాన హామీని కూడా అమలు చేయకపోవడం దారుణమని తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గుండవరం దేవీప్రసాద్ విమర్శించారు. మూడు సంవత్సరాలు సమయం ఇచ్చినా సమస్యలు పరిష్కరించని ప్రభుత్వం మరో రెండేళ్లు సమయం కోరడం ఉద్యోగుల పట్ల అమానుష వైఖరికి నిదర్శనమన్నారు. పీఆర్సీ, పెండింగ్ డీఏలు, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ, పెన్షన్ బకాయిల చెల్లింపు, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి ఐదేళ్లకు రావాల్సిన పీఆర్సీని పదేళ్లకు ఒకసారి చేసే కుట్ర జరుగుతోందన్న అనుమానాలు ఉద్యోగుల్లో ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం పదేళ్లకు ఒకసారి పీఆర్సీ ప్రతిపాదించినప్పుడు ఉద్యోగులు ఐక్యంగా పోరాడి తిప్పికొట్టిన విషయాన్ని గుర్తు చేశారు.


ఉద్యోగుల ఐక్యతను దెబ్బతీసేందుకు సంఘాల్లో చీలికలు తీసుకురావడం, ఉద్యోగులు-ఉపాధ్యాయుల మధ్య విభేదాలు సృష్టించడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు, ఆందోళనలు చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని తెలిపారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు, ఉద్యోగ సంఘాలు నిరసనలు చేపడితే వాటిని కౌంటర్ ఉద్యమాలతో అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు.

**సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్**

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు భేదాభిప్రాయాలను పక్కనపెట్టి సెప్టెంబర్ 10న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి భారీగా తరలివచ్చి ప్రభుత్వానికి తమ ఐక్యతను చాటాలని దేవీప్రసాద్ పిలుపునిచ్చారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడి, సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగించాలని కోరారు.


## టీపీసీసీపై మహేష్ కుమార్ గౌడ్ మార్క్

# రెండేళ్ళ ప్రస్థానం అద్వితీయం



పదవి చేపట్టడం ఒక ఎత్తయితే.. దానికి వన్నె తీసుకురావడం మరో ఎత్తు. రాజకీయ పార్టీల్లో రాష్ట్ర అధ్యక్షుడి హోదా అలంకార ప్రాయంగా మిగలకుండా.. కార్యకర్తలను సమన్వయం చేస్తూ, సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేస్తూ, పార్టీని క్షేత్రస్థాయిలో చైతన్యపరచడం కీలకం. ఈ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ రెండేళ్ల ప్రస్థానం ప్రాధాన్యం సంతరించుకుంది. గాంధీభవన్‌కే పరిమితం కాకుండా జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల స్థాయికి పార్టీ కార్యక్రమాలను తీసుకెళ్లడంపై ఆయన దృష్టి సారించారు. కార్యకర్తలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవడం.. ఏఐసీసీ కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడం.. సంస్థాగత కమిటీల ఏర్పాటును వేగవంతం చేయడం.. పార్టీ-ప్రభుత్వాల మధ్య సమన్వయానికి వేదికలు కల్పించడం వంటి చర్యలతో తనదైన ముద్ర వేశారు. అధికారంలో ఉన్న పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడి బాధ్యత మరింత కీలకం. ప్రభుత్వ పాలనకు, పార్టీ కార్యక్రమాలకు మధ్య సమన్వయం సాధించడంతో పాటు క్షేత్రస్థాయి కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపడం, ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులను నిరంతరం కదిలించడం సవాలుతో కూడుకున్న వ్యవహారం. మహేష్‌కుమార్ గౌడ్ ఈ బాధ్యతలను సంస్థాగత దృష్టితో ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. బీసీ కులగణన, 'జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్' వంటి కార్యక్రమాల నుంచి 'సంఘటన్ సృజన్ అభియాన్' వరకు పార్టీ కార్యాచరణను విస్తృతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఫలితంగా కార్యకర్తలతో మమేకమయ్యే అధ్యక్షుడిగా, పార్టీ యంత్రాంగాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే నాయకుడిగా మహేష్‌కుమార్ గౌడ్ తనదైన గుర్తింపు సాధించారు. కాంగ్రెస్ వంటి సుదీర్ఘ చరిత్ర కలిగిన పార్టీకి కార్యకర్తలే అసలు బలం. ఎన్నికల సమయంలో మాత్రమే కార్యకర్తలను గుర్తించడం కాకుండా, నిరంతరం వారితో మమేకం కావాలన్నది మహేష్‌కుమార్ గౌడ్ నాయకత్వంలో కనిపించిన ముఖ్యమైన అంశం. గాంధీభవన్ కేంద్రంగా జరిగే సమావేశాలతో పాటు జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాలు, గ్రామస్థాయిలో కార్యకర్తలను కలుసుకోవడంపై ఆయన దృష్టి పెట్టారు.

'కార్యకర్తల పక్షపాతి'గా ఆయనకు వచ్చిన గుర్తింపు కూడా ఈ నేపథ్యంలోనే చూడాలి. కార్యకర్తల సమస్యలను వినడం, పార్టీ కార్యక్రమాల్లో వారికి బాధ్యతలు అప్పగించడం, సంస్థాగత నిర్ణయాల్లో క్షేత్రస్థాయి నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా పార్టీకి-కార్యకర్తకు మధ్య దూరాన్ని తగ్గించే ప్రయత్నం చేశారు.



రాహుల్ గాంధీ ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకెళ్లిన బీసీ కులగణన అంశం తెలంగాణ కాంగ్రెస్ రాజకీయ కార్యాచరణలో కీలకంగా మారింది. సామాజిక న్యాయం, జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం, బీసీల రాజకీయ భాగస్వామ్యం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో టీపీసీసీ కీలక పాత్ర పోషించింది.

ఈ అంశాన్ని కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా సామాజిక-రాజకీయ చర్చగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ యంత్రాంగాన్ని వినియోగించడం మహేష్‌కుమార్ గౌడ్ నాయకత్వంలోని ముఖ్యమైన రాజకీయ కార్యక్రమాల్లో ఒకటిగా నిలిచింది. బీసీ వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం అనే అంశాన్ని కాంగ్రెస్ రాజకీయ అజెండాలో మరింత బలంగా నిలబెట్టడంలో రాష్ట్ర పార్టీ వ్యవస్థ పనిచేసింది.

ఏఐసీసీ పిలుపు మేరకు చేపట్టిన 'జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్' కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులను కదిలించాయి. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు రాజ్యాంగ పరిరక్షణ అంశాన్ని రాజకీయ చర్చలో నిలబెట్టడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం.ఈ కార్యక్రమాలను కేవలం రాష్ట్ర రాజధానికే పరిమితం చేయకుండా జిల్లాలు, మండలాలు, గ్రామాల వరకు తీసుకెళ్లడంలో టీపీసీసీ యంత్రాంగం కీలకంగా వ్యవహరించింది. పార్టీకి సంబంధించిన జాతీయ స్థాయి కార్యక్రమాలను స్థానిక స్థాయిలో అమలు చేయగలిగే సంస్థాగత సామర్థ్యం ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమాలు మరోసారి చాటాయి.

రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు గాంధీభవన్‌లో కూర్చొని పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించడం ఒక పద్ధతి. కానీ ప్రజల మధ్యకు వెళ్లి కార్యకర్తలను కలుసుకోవడం మరో పద్ధతి. మహేష్‌కుమార్ గౌడ్ రెండో మార్గాన్ని ఎంచుకున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. జనహిత పాదయాత్రల ద్వారా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించడం, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలను కలుసుకోవడం ద్వారా పార్టీ అధ్యక్షుడి స్థాయిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం జరిగింది. స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకోవడం, కార్యకర్తల అభిప్రాయాలను వినడం, పార్టీ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేయడం వంటి అంశాలు ఈ పర్యటనల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

గాంధీభవన్‌లో మంత్రులతో ముఖాముఖి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం మరో వినూత్న ప్రయత్నంగా నిలిచింది. పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లోని సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లేందుకు వేదిక కల్పించడం ద్వారా పార్టీ-ప్రభుత్వ సమన్వయానికి అవకాశం ఏర్పడింది. అధికారంలో ఉన్న పార్టీకి ప్రజా సమస్యలు, కార్యకర్తల సమస్యలు నేరుగా ప్రభుత్వానికి చేరడం ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం స్పష్టం చేసింది. ప్రభుత్వానికి పార్టీ యంత్రాంగం మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చూడాలన్న ప్రయత్నంగా దీనిని చూడవచ్చు.ఎంజీఎన్ఆర్ఈజీఏ పేరు, విధానాల్లో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మార్పులను వ్యతిరేకిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు గ్రామస్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపట్టడం ద్వారా కాంగ్రెస్ తన రాజకీయ పోరాటాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లింది. రామ్‌జీ పాలసీకి వ్యతిరేకంగా గ్రామ తీర్మానాలు చేపట్టడం, గ్రామ గ్రామానా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పార్టీ ఉద్యమాలకు స్థానిక రూపం ఇవ్వడానికి ప్రయత్నించింది.

అదేవిధంగా ఓటు హక్కు పరిరక్షణ, 'ఓట్ చోరీ' అంశాలపై సంతకాల సేకరణ వంటి కార్యక్రమాలు కూడా పార్టీ కార్యకర్తలకు నిరంతర రాజకీయ కార్యాచరణను అందించాయి. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయంగా కనిపించే పార్టీ కాకుండా, ప్రజాస్వామ్య అంశాలపై నిరంతరం స్పందించే సంస్థగా కాంగ్రెస్‌ను ప్రజల్లో నిలబెట్టాలన్న లక్ష్యం ఇందులో కనిపించింది.ఏ పార్టీ బలం దాని నాయకుల సంఖ్యతో కాకుండా, దాని సంస్థాగత నిర్మాణం ఎంత పటిష్ఠంగా ఉందనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో 'సంఘటన్ సృజన్ అభియాన్'కు ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. జిల్లా అధ్యక్షుల నియామకం, జిల్లా కమిటీల ఏర్పాటు, మండలం, పట్టణం, డివిజన్ స్థాయిలో అధ్యక్షుల నియామకం, కమిటీల ఏర్పాటు వంటి ప్రక్రియలను వేగవంతం చేయడం ద్వారా కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణానికి పునాది బలపరిచే ప్రయత్నం జరిగింది. సంస్థాగత ఖాళీలను భర్తీ చేయడం ద్వారా పార్టీకి ఎన్నికల సమయంలోనే కాకుండా సాధారణ పరిస్థితుల్లోనూ పనిచేసే యంత్రాంగాన్ని సిద్ధం చేయడం దీని ప్రధాన లక్ష్యంగా కనిపించింది. 'న్యాయ్ భోజ్', 'చాత్రోంకీ గూంజ్' వంటి ఏఐసీసీ కార్యక్రమాలను రాష్ట్రంలో నిర్వహించడం ద్వారా విద్యార్థులు, యువత, సామాజిక వర్గాలను పార్టీ కార్యక్రమాలతో అనుసంధానం చేసే ప్రయత్నం జరిగింది. భవిష్యత్ రాజకీయాలకు యువతే కీలకమనే వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని వారిని పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం సంస్థాగతంగా అవసరమైన అడుగు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పార్టీ శ్రేణులను అప్రమత్తం చేయడం, ఓటర్ల జాబితాపై క్షేత్రస్థాయిలో పనిచేయడానికి ప్రాధాన్యం ఇవ్వడం కూడా అధ్యక్ష పదవిలో ముఖ్యమైన అంశంగా నిలిచింది. ఓటర్ల జాబితా వంటి సాంకేతిక అంశాలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున, బూత్ స్థాయి నుంచి పార్టీ యంత్రాంగాన్ని చైతన్యపరచడం అవసరం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో పాటు మున్సిపాలిటీ, కార్పొరేషన్, సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం ద్వారా ఎన్నికల యంత్రాంగాన్ని నిరంతరం క్రియాశీలంగా ఉంచే ప్రయత్నం జరిగింది. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడం ద్వారా పార్టీ సంస్థాగత బలాన్ని ఎన్నికల రాజకీయాల్లోకి అనువదించేందుకు కృషి చేశారు. పార్టీని ఎన్నికల సమయంలో మాత్రమే పనిచేసే యంత్రాంగంగా కాకుండా నిరంతరం ప్రజల్లో ఉండే సంస్థగా తీర్చిదిద్దాలంటే నాయకత్వానికి శిక్షణ అవసరం. ఈ ఆలోచనతో జిల్లా అధ్యక్షులకు శిక్షణ శిబిరాలు నిర్వహించడం ద్వారా సంస్థాగత వ్యవహారాలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ, ప్రజా సమస్యలపై పోరాటం వంటి అంశాల్లో దిశానిర్దేశం చేశారు.

మహేష్‌కుమార్ గౌడ్ రెండేళ్ల టీపీసీసీ అధ్యక్ష పదవీకాలాన్ని కేవలం నిర్వహించిన కార్యక్రమాల సంఖ్యతో కొలవడం సరైనది కాదు. కార్యకర్తలతో అనుబంధం, పార్టీ సంస్థాగత నిర్మాణం, ఏఐసీసీ కార్యక్రమాల అమలు, క్షేత్రస్థాయి ఉద్యమాలు, ప్రభుత్వంతో సమన్వయం, ఎన్నికల నిర్వహణ ఈ అంశాలన్నింటినీ కలిపి చూస్తే ఆయన నాయకత్వ శైలి స్పష్టమవుతుంది.రాజకీయ పార్టీల్లో అధ్యక్ష పదవి ఒక అలంకార పదవి కాదు. అది పార్టీకి దిశానిర్దేశం చేసే బాధ్యత. ముఖ్యంగా అధికారంలో ఉన్న పార్టీకి అధ్యక్షుడి పాత్ర మరింత సంక్లిష్టమైనది. ప్రభుత్వం-పార్టీ మధ్య సమన్వయం, కార్యకర్తల ఆకాంక్షలు, ప్రజల సమస్యలు, అధిష్ఠానం ఆదేశాలు ఇవన్నింటినీ సమన్వయం చేయాల్సిన బాధ్యత అధ్యక్షుడిపై ఉంటుంది.ఈ నేపథ్యంలో మహేష్‌కుమార్ గౌడ్ రెండేళ్ల ప్రస్థానం కార్యకర్తలతో మమేకమై, సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేస్తూ, పార్టీని క్షేత్రస్థాయిలో చురుకుగా ఉంచే ప్రయత్నంగా. ఆయనకు కాంగ్రెస్ శ్రేణుల్లో ఏర్పడిన 'మహేశన్న' అనే ఆత్మీయ గుర్తింపు కూడా నాయకుడిగా ఆయన కార్యకర్తలతో ఏర్పరచుకున్న అనుబంధానికి ప్రతీకగా చూడవచ్చు.

## బూతుపురాణం వినేందుకు అసెంబ్లీకి రావాలా?



( మొదటి పేజీ తరుయవాయి )

కేసీఆర్ తెలిపారు. ఉద్దేశపూర్వకంగా రైతులకు సాగునీరు ఇవ్వకుండా ప్రభుత్వం గోస పెడుతోందని, రాజకీయాల కోసం అద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టారని విమర్శించారు. ప్రాజెక్టుల పంపులు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల దగ్గరకు వెళ్దామని, నియోజకవర్గాల పునర్విభజన కచ్చితంగా జరుగుతుందని అన్నారు. అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల్లో ప్రభుత్వంపై గట్టిగా పోరాడాలని ఆదేశించారు. సమావేశంలో తన గురించే ఎక్కువ మాట్లాడే ప్రయత్నం చేస్తారని, పట్టించుకోకూడదని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలకు అందరూ తప్పకుండా హాజరుకావాలని, శాసనసభ, మండలిలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలని బీఆర్ఎస్ సభ్యులకు కేసీఆర్ తెలిపారు. అసెంబ్లీ సమావేశాలను ఎవరూ తేలిగ్గా తీసుకోవద్దని సూచించారు.

**అసెంబ్లీ సమావేశాలు 15రోజులు పెట్టాలి**

స్పీకర్ వైఖరిపై బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో చర్చించాలని కేసీఆర్ పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలు 15 నుంచి 20 రోజులు నిర్వహించేలా బీఏసీ సమావేశంలో పట్టుబట్టాలని గులాబీ నేతలకు కేసీఆర్ సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు కోపంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. వచ్చే ఎన్నికల్లో వందశాతం తాము అధికారంలోకి వస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఇది సర్వభ్రష్ఠ ప్రభుత్వమని విమర్శించారు. కాంగ్రెస్ హామీలను చూసి ప్రజలు మోసపోయారని అన్నారు. ప్రజలకు ఎవరేంటో అర్థమైందని చెప్పారు.

### రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేస్తా

త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేస్తానని గులాబీ బాస్ తెలిపారు. కాంగ్రెస్ వైఫల్యాలు, సాగు నీటి సమస్యలపై పాదయాత్రకు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. పాదయాత్ర తానే చేయాలా లేక కేటీఆర్ చేయడమా అనే అంశంపై చర్చిస్తున్నట్లు చెప్పారు. ప్రజా సమస్యలే అజెండాగా అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఎండగట్టాలని దిశానిర్దేశం చేశారు. పాలమూరు, కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కోసం లక్షమందితో ఆందోళన చేయాలని నిర్ణయించామని అన్నారు. అవసరమైతే తానే ఆందోళనకు నేతృత్వం వహిస్తానని తెలిపారు. నదీ జలాల వాటా విషయంలోనూ పోరుబాటకు సిద్ధం కావాలని గులాబీ నేతలకు ఆదేశించారు. నియోజకవర్గాల వారీగా స్థానిక సమస్యలే అజెండాగా ప్రజలతో మమేకం కావాలని కేసీఆర్ మార్గనిర్దేశం చేశారు.

నదీ జలాల వాటాల విషయంలో అవసరమైతే యుద్ధమేనని స్పష్టం చేశారు.

## రాహుల్ గాంధీనే ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థి

- **కేసీ వేణుగోపాల్**
- **ఎవరూ గందరగోళ పరిస్థితుల్ని సృష్టించవద్దు**

ఢిల్లీ, మహా : కొద్ది రోజులుగా ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థికి సంబంధించి పలు ఊహాగానాలు వస్తున్న వేళ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేసీ వేణుగోపాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2029 లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీనే నాయకత్వం వహిస్తారని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం రోజు నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కేసీ వేణుగోపాల్ ఇలా వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో టీవీకే పార్టీ తమ నాయకుడు, తమిళనాడు ముఖ్యమంత్రి సి. విజయ్ జోసెఫ్‌ను ఇండియా కూటమి తరఫున ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రతిపాదించిందన్న వార్తలను వేణుగోపాల్ ఖండించారు. విజయ్ గురించి ప్రస్తావిస్తూ విలేకరులు అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ ఆ




కథనాల్లో నిజం లేదని, టీవీకే అలాంటి డిమాండ్ ఏం చేయలేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎవరూ ఇలాంటి గందరగోళ పరిస్థితుల్ని సృష్టించవద్దని, ఇండియా కూటమి ముఖచిత్రంగా రాహుల్ గాంధీనే ఉంటారని వెల్లడించారు. రైతులు, యువత, విద్యార్థులకు సంబంధించిన అనేక సమస్యలపై రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న రాజకీయ కార్యక్రమాలకు దేశవ్యాప్తంగా కూడా విశేష ఆదరణ లభిస్తోందని కేసీ వేణుగోపాల్ తెలిపారు. విద్యార్థులు, రైతులు, యువత ఇలా ఏదైనా ఆయన నాయకత్వంలో జరుగుతున్న పోరాటాల గురించే ఇప్పుడు దేశవ్యాప్తంగా ఎక్కువగా చర్చ జరుగుతోందని ప్రశంసలు కురిపించారు. అయితే రాహుల్ గాంధీనే ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తారా అని విలేకరులు మరోసారి ప్రశ్నించగా కచ్చితంగా అంటూ వేణుగోపాల్ క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం భారతీయులు అత్యధికంగా ఆదరించే ప్రముఖ నాయకుల్లో రాహుల్ గాంధీనే ముందు వరుసలో ఉంటారని, ఆయన తీసుకునే నిర్ణయాలను, చేసే పనులను ప్రజలంతా ఎంతో ఆసక్తిగా గమనిస్తున్నారని చెప్పారు. కొన్ని రాష్ట్రాల్లో తమ భాగస్వామ్య పక్షాల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ, ఇండియా కూటమి మాత్రం ఇప్పటికీ బలంగానే ఉందని చెప్పుకొచ్చారు

## ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం.

- **పెళ్లి పేరుతో మోసం చేశాడంటూ ఫిర్యాదు.**
- **మూడు రోజులకే తీవ్ర నిర్ణయం.**
- **ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించిన ఈశ్వర్ సాయి.**

**హైదరాబాద్, మహా :** ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తనను పెళ్లి పేరుతో నమ్మించి మోసం చేశాడంటూ ఫోక్ డ్యాన్సర్ ఈశ్వర్ సాయిపై ఆమె ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కేసు నమోదైనప్పటికీ ఈశ్వర్ సాయిని పోలీసులు అరెస్టు చేయకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మాధురి ఈ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.మాధురి రాథోడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఈశ్వర్ సాయిపై కేసు నమోదైంది. కేసు నమోదైన మూడు రోజులకే మాధురి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటన తాజాగా వెలుగులోకి రావడంతో ఫోక్ డ్యాన్సర్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.తనపై కేసు నమోదైన అనంతరం ఈశ్వర్ సాయి పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్నట్లు సమాచారం. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారని తెలుస్తోంది. ఇదే సమయంలో తన ఫిర్యాదుపై చర్యలు తీసుకోవడంలో పోలీసులు జాప్యం చేస్తున్నారని మాధురి ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఈశ్వర్ సాయి మోసం చేశాడని మాధురి ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఆమె పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. అయితే కేసు నమోదైనప్పటికీ ఈశ్వర్ సాయి అరెస్టు కాకపోవడంతో ఆమె తీవ్రంగా కలత చెందినట్లు తెలుస్తోంది.ఇదిలా ఉండగా, తనపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఈశ్వర్ సాయి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. దీంతో ఒకవైపు పోలీసులు అతడి కోసం గాలిస్తుండగా.. మరోవైపు కేసు నుంచి రక్షణ కోసం ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించిన పరిస్థితి నెలకొంది.తన ఫిర్యాదుపై పోలీసులు వెంటనే స్పందించి ఈశ్వర్ సాయిని అరెస్టు చేయాలని మాధురి కోరినట్లు సమాచారం. అరెస్టు విషయంలో జాప్యం జరుగుతోందని ఆమె ఆరోపించారు. ఈ క్రమంలోనే తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

కాగా, కేసు నమోదైన తర్వాత ఈశ్వర్ సాయి పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొంటున్నట్లు సమాచారం. అతడి ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోందని తెలుస్తోంది. ఈ వ్యవహారంలో తదుపరి పోలీసుల చర్యలు, హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ కీలకంగా మారాయి.

## తెలంగాణ విమోచన జైత్రయాత్రకు బ్రేక్



**హైదరాబాద్, మహా :** తెలంగాణ విమోచన జైత్రయాత్రలో భాగంగా బీజేపీ చేపట్టాలని నిర్ణయించిన భారీ బైక్ ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించారు. బాలాపూర్ శివాజీ చౌక్ నుంచి చార్మినార్ వద్దనున్న భాగ్యలక్ష్మి ఆలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించేందుకు బీజేపీ ఏర్పాట్లు చేయగా.. అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. ర్యాలీ నేపథ్యంలో మహేశ్వరం బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు సహా పలువురు బీజేపీ నేతలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.ఆదివారం బాలాపూర్ శివాజీ చౌక్ వద్ద బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. తమ పార్టీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలుసుకున్న కార్యకర్తలు అక్కడికి చేరుకుని నిరసనకు సిద్ధమయ్యారు. అయితే పోలీసులు వారిని అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ర్యాలీకి అనుమతి నిరాకరించడం, పార్టీ నేతలను ముందస్తుగా అదుపులోకి తీసుకోవడంపై బీజేపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.తెలంగాణ విమోచన జైత్రయాత్రలో భాగంగా బాలాపూర్ నుంచి చార్మినార్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. ఇందులో భాగంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. అయితే ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు తేల్చిచెప్పడంతో బీజేపీ కార్యక్రమానికి అడ్డంకి ఏర్పడింది.

ర్యాలీని అడ్డుకునే చర్యల్లో భాగంగానే బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. మహేశ్వరం బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు సహా పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై పార్టీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.తమ నేతల అరెస్టు విషయం తెలుసుకున్న బీజేపీ కార్యకర్తలు శివాజీ చౌక్ వద్దకు చేరుకోవడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. నిరసనకు సిద్ధమైన కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. పరిస్థితి అదుపు తప్పకుండా పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో శివాజీ చౌక్ వద్ద కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.పోలీసుల చర్యలపై బీజేపీ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం హిందువులను అణచివేస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కూడా ప్రభుత్వం, పోలీసులు అడ్డుకుంటున్నారని విమర్శించారు. తమ పార్టీ చేపట్టిన కార్యక్రమానికి అనుమతి ఇవ్వకుండా, నేతలను ముందస్తుగా అరెస్టు చేయడం సరికాదని అన్నారు.అరెస్టులు, పోలీసుల ఆంక్షలతో బీజేపీ కార్యక్రమాలను అడ్డుకోలేరని ఆ పార్టీ నేతలు స్పష్టం చేశారు. తెలంగాణ విమోచన చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ పోరాటం కొనసాగుతుందని తేల్చిచెప్పారు.తెలంగాణ విమోచన జైత్రయాత్రలో భాగంగా నిర్వహించాలనుకున్న బైక్ ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించడంతో బీజేపీ, పోలీసుల మధ్య మరోసారి వివాదం తెరపైకి వచ్చింది. బాలాపూర్ నుంచి చార్మినార్ వరకు ప్రతిపాదించిన ర్యాలీకి అనుమతి విషయంలో పోలీసులు తీసుకున్న నిర్ణయంపై బీజేపీ శ్రేణులు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. మరోవైపు ముందస్తు అరెస్టులు, కార్యకర్తల అదుపులోకి తీసుకోవడం వంటి పరిణామాలతో బాలాపూర్ శివాజీ చౌక్ వద్ద రాజకీయ ఉద్రిక్తత నెలకొంది.

ANN తెలుగు

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ | 07-09-2026



## సూపర్ మార్కెట్

పిలవకున్నా
లోపలికెళ్ళాలనేఉబలాటం
అడుగు పడగానే
కలర్ ఫుల్ ప్యాకింగ్ చెమ్కీల్లోంచి
తీరొక్క వస్తువుల పలుకరింపులు
ప్లీజ్ టచ్మీ అంటూ
ఐటమ్ ల గప్ చుప్ పిలుపులు
మాటలు కరువు
మంచి చెడు చూసుడు బరువు
అంతా రంగుల పపంచం
కోరికల సైగలు చప్పరింతలు
చూపులతోనేబేరం
కష్టమర్ డబ్బుగా మారిన మాయా లోకంలో
మోసానికిమనస్పూర్తిఅగ్రిమెంట్
జిగేలురాని లైట్లపపంచం
సూపర్ ఉంటదిచూడ ముచ్చటగుంటది
చూస్తుండగానేపైసలనూతి ఎండిపోతది
నొయ్యకుంటనేనెత్తురు గుంజుతది
అమ్మేవాని కొనేవాని వూరు పేరు ఏమిలేవు
ఎంతటివాడైనా
సందు సందు తిరిగిసామాను కుప్ప జేసుడే
ఇక్కడంతా సెల్ఫ్ సర్వీస్
మునుగుడు కూడా సెల్ఫగానే
బిందెల తలకాయ ఇరుక్కున్నంత గోస .
గింత ధరనా గంతధరనా
కల్తీ,కరాబ్ మాటలు జాంతానై
కొసరు, కొత్మీరులు అడుగుడేబంద్
తాతా మామా బావా వరుసల బేటీలు కావు
అద్మరాతిరిసుట్టమస్తే
షాపు తీసేహనుమాండ్లు శావుకారి
ఉద్దెర మొఖం బెడితేఉరుముకుంటన్నా
తైలినింపిపంపించే
ఎండిగాజుల ఎంకమ్మ నేడు కానరాదు
జోకుతున్నంత సేపు
సంసారంముచ్చట్లు ఒలుసుకుంటకూసుండే
మల్లేసు మామ దుకాణం కాదిది
ఇపుడు
బుట్టిదుకాండ్లన్నీ ఈగలు దోమల గోదాములైనయ్
తక్కడిబాట్లు చుక్కలు సూస్తున్నయి
అగ్గువకు అంచానకు
గుగ్గిలం మైసాక్షిఅమ్ముకునే
రేకు డబ్బల పాత శావుకార్లు
గిరాకిలేక అంగల్లు తిరుగు తున్నలు
సూపర్ మార్కెట్ ఒక స్టేటస్ సింబల్
లోపల ఈఎంఐ బొద్దింకలుసతాయిస్తున్నా
పైన పటారం మెరుస్తూ నేఉండాలా
ఏనుగు చెవుల తీరు ఊగుతూనేఉండాలా నోటికితాళ
మేసివేలు ముద్రలేసి
బాకీతెచ్చుకున్న కాలం కాదిది
కంప్యూటర్ కాటల చెయ్యివెట్టి కత్తి కిందికి మెడవం
చేకాలమిది
మారిందేమిలేదు
దూరపు కొండలు
దగ్గరికేలితేరాళ్లు రప్పలు
కార్పొరేట్ పడగ కింద
దిక్కు తోచని సగటు పక్షులు

**డా. ఉదారినారాయణ,**
**9441413666**

## "ఆధారం అంకె" ఏది ??

పై కప్పు ఆకాశమే !
శయ్య నేలనే !
దొరికితేనే తిండి !
లేకుంటే రోజూ ఏకాదశి !

దేశంలో ఎన్ని బట్టల మిల్లులో !
కాని ఈ అనాథలు మహాత్మా గాంధీలా అర్ధ నగ్నంగా సంచారులే ??

భారత మాత వీరిని చూస్తూ
హిమాలయం కరిగేంతగా
ఏడుస్తోంది
అందుకే మంచు కరిగి తుఫానులు!

పాలకుల చూపుకు రాని వీరు
ఏ ప్రణాళికలో ఉంటారు !!
వీరికి "ఆధారం అంకె "ఏది ??

**కందాళై రాఘవాచార్య**
**8790593638**

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.

43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad.
Telangana- 500034.

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

అనువాద కథ

# 76 చీకటిలో ఈల





**మూలం: రస్కిన్ బాండ్**
**అనువాదం: జ్వలిత.**
**9989198943**

**పౌర్ణమి రోజు వలె చంద్రుడు నిండుగా ఉన్నాడు. ప్రకాశవంతమైన వెన్నెల వరద రహదారిని ముంచెత్తుతోంది. కానీ చెట్ల నీడలు నన్ను వెంటాడుతున్నట్లు ఉన్నాయి. నా వైపు చాచుకొస్తున్న ఒక్ చెట్టు వంకర కొమ్మలు నన్ను భయపెట్టాయి. మరికొన్ని తమకు తోడు కోరుతున్నట్లు అనిపించాయి.**

'చెట్లు నడవగలవని' ఒకసారి నాకు కల వచ్చింది. ఇలాంటి వెన్నెల రాత్రులలో అవి కాసేపు తమ వేళ్ళను పెకిలించుకుని, ఒకదానికొకటి కలుసుకుని, పాత విషయాల గురించి మాట్లాడుకుంటాయి. ఎందుకంటే అవి ఎందరో మనుషులను, ఎన్నో సంఘటనలను చూశాయి, ముఖ్యంగా పెద్దవాళ్ళను. ఆ తర్వాత తెల్లవారుజామున, తాము పెరగడానికి విధించిన తమ స్థానాలకు తిరిగి వెళ్ళిపోతాయి. రాత్రికి ఒంటరి కాపలాదారులుగా. నడవడానికి ఇది వాటికి మంచి రాత్రి. అవి అలా నడవడానికి ఆత్రుతగా ఉన్నట్లు కనిపిస్తాయి: ఆకుల గలగల, కొమ్మలు విరగడం రాత్రి నిశ్శబ్దంలో వాటి లోపలి నుండి వెలువడే శబ్దాలు అవి.

నేను ఉదయం నడకలో ఉన్నప్పుడు. అప్పుడప్పుడు చీకట్లో ఇతర బాటసారులు నన్ను దాటి వెళ్లారు. అప్పటికి ఇంకా ఉదయం ఎనిమిది గంటలు మాత్రమే అయింది. కొందరు ఇంటికి వెళ్తున్నారు. మరికొందరు పట్టణంలోని ఆ మెరిసే దీపాలు, దుకాణాలు, రెస్టారెంట్లను చూడటానికి నడుచుకుంటూ వెళ్తున్నారు. వెలుతురు లేని ఆ దారిలో నేను వాళ్లను గుర్తుపట్టలేకపోయాను. వాళ్లు నన్ను గమనించలేదు. నాకు నా చిన్ననాటి ఒక పాత పాట గుర్తొచ్చింది. మెల్లగా నేను ఆ పాట రాగాన్ని గొణిగాను.. కొద్దిసేపటికే ఆ పాటలోని పదాలు నాకు మళ్లీ గుర్తొచ్చాయి:

"మేము ముగ్గురం,
మేము గుంపు కాదు;
మేము తోడు కూడా కాదు
నా ప్రతిధ్వని,
నా నీడ,
నేను..."

నా పక్కన నిశ్శబ్దంగా కదులుతున్న నా నీడ వైపు చూశాను.

మన నీడలను మనం తేలికగా తీసుకుంటాం కదా! అదిగో అవి, జీవితాంతం మనతో ఉండే ఫిర్యాదు చేయని సహచరులు. మనం చేసే ప్రతి పనికీ, చేయకుండా వదిలేసే ప్రతి పనికీ అవి నిశ్శబ్దమైన, నిస్సహాయమైన సాక్షులుగా ఉంటాయి. ఈ ప్రకాశవంతమైన వెన్నెల రాత్రిలో నిన్ను గమనించకుండా ఉండలేకపోయాను, నీడా! నేను సిగ్గుపడే విషయాలన్నింటినీ నువ్వు చూడాల్సి వచ్చినందుకు విచారం కలిగింది: కానీ, నేను చిన్న చిన్న విజయాలు సాధిస్తున్నప్పుడు నువ్వు నా పక్కన ఉన్నందుకు సంతోషించాను కూడా. ఇక నా ప్రతిధ్వని సంగతేంటి? నా పిలుపు నాకు తిరిగి వినిపిస్తుందేమోనని పిలవాలని అనుకున్నాను; కానీ పర్వతాల సంపూర్ణ నిశ్శబ్దాన్ని గానీ, చెట్ల సంభాషణలను గానీ భంగపరచడం ఇష్టం లేక అలా చేయకుండా ఆగాను.

ఆ దారి కొండపైకి మెలికలు తిరుగుతూ వెళ్లి, పైకి చేరాక సమతలంగా మారింది. అక్కడ ఒక ఎగిరే ఉడుత, ఒక చెట్టును దాటుకుంటూ దారిపై జారుకుంటూ వెళ్ళింది. అది పొడవైన దేవదారు వృక్షాల మధ్య అల్లుకున్న వెన్నెల పట్టీలా మారింది. ఒక నైట్ జార్ పక్షి కూసింది. మిగిలినదంతా నిశ్శబ్దం. పాత శ్మశానం నాకు కనిపించింది. అక్కడ చాలా పాత సమాధులు ఉన్నాయి. వాటిలో కొన్ని చాలా పెద్దవి, స్మారక చిహ్నాలులా ఉన్నాయి. ఇటీవలి సమాధులు కూడా కొన్ని ఉన్నాయి, ఎందుకంటే ఆ శ్మశానం ఇంకా వాడుకలోనే ఉంది. వాటిలో ఒకదానిపై అక్కడక్కడా పూలు చెల్లాచెదురుగా ఉండటం నేను చూశాను. కొన్ని ఆలస్యంగా పూసిన డాలియా పువ్వులు, స్కార్లెట్ సాల్వియా వంటి పూలు. ప్రహరీగోడ దగ్గర మరికొంత ముందుకు వెళితే, భారీ వర్షాలకు శ్మశానం నిలుపేగోడలో కొంత భాగం, భారీ వర్షాలకు కూలిపోయింది. గోడతో పాటు సమాధి రాళ్లు కూడా కూలిపోయాయి. ఒక సమాధి బయటపడింది. కుళ్లిపోతున్న శవపేటిక, చెల్లాచెదురుగా పడి ఉన్న కొన్ని ఎముకలు, మనలాగే జీవించి, ప్రేమించిన ఒకరి అవశేషాలుగా మిగిలాయి. సమాధిరాయిలో కొంత భాగం రోడ్డు పక్కన పడి ఉంది, కానీ దానిపై ఉన్న అక్షరాలు చెరిగిపోయాయి. నేను సాధారణంగా విచారాన్ని ఇష్టపడే వ్యక్తిని కాదు, కానీ ఏదో తెలియని కారణంతో నేను వంగి, బహుశా పుర్రెలో భాగమైన ఒక నునుపైన, గుండ్రని ఎముక ముక్కను చేతిలోకి తీసుకున్నాను. నా చేయి దానిపై పడగానే, ఆ ఎముక ముక్కలైపోయింది. నేను వాటిని గడ్డిలో పడవేశాను. అవి మట్టిలో కలిసిపోయాయి.

ఎక్కడి నుంచో, మరీ దూరంలో కాకుండా, ఎవరో ఈల వేస్తున్న శబ్దం వినిపించింది.

మొదట, నేను నా పాత పాటను గొనుగుతున్నట్లే, తనలో తాను ఈల వేసుకుంటున్న, నావంటి మరో రాత్రి విహారాలు చేసేవాడేమో అనుకున్నాను. కానీ ఆ ఈల వేసేవాడు చాలా వేగంగా దగ్గరకు వచ్చాడు; ఆ ఈల బిగ్గరగా, ఉల్లాసంగా ఉంది. ఒక బాలుడు సైకిల్‌పై వేగంగా దూసుకుపోయాడు. రోడ్డుపై నీడల గుండా అతని సైకిల్ దూసుకుపోయే ముందు, నేను అతన్ని ఒక్క లిప్తపాటు మాత్రమే చూడగలిగాను.

కానీ అతను కొన్ని నిమిషాల్లోనే మళ్ళీ వచ్చాడు. ఈసారి అతను నాకు కొన్ని అడుగుల దూరంలో ఆగి, ఒక వింత చిరునవ్వు విసిరాడు. పద్నాలుగు, పదిహేనేళ్ల, సన్నగా, నల్లగా ఉన్న ఒక కుర్రాడు. అతను స్కూల్ దుస్తులు, పసుపు రంగు స్కార్ఫ్‌ను ధరించాడు. అతని కళ్ళు వెన్నెల కొలనుల్లా ఉన్నాయి.

"మీ సైకిల్‌కి గంట లేదు కదా," అని నేను అన్నాను.

అతను ఏమీ మాట్లాడలేదు, తల కొద్దిగా పక్కకి వంచి నా వైపు చూసి నవ్వాడు. నేను చేయి చాపాను, అతను దాన్ని అందుకుంటాడు అనుకున్నాను. కానీ హఠాత్తుగా, అతను మళ్ళీ ఈల వేసుకుంటూ వెళ్ళిపోయాడు. ఈల వేసే ఒక స్కూలు పిల్లాడు. అప్పటికి ఆ వయసుకు కాస్త ఆలస్యమైనప్పటికీ, తను ఒక స్వతంత్ర భావాలున్న వ్యక్తిలా కనిపించాడు.

ఈల శబ్దం క్రమంగా తగ్గుతూ, ఆపై పూర్తిగా ఆగిపోయింది. అడవిపై గాఢమైన నిశ్శబ్దం, శబ్దాన్ని నిరాకరించే నిశ్శబ్దం ఆవరించింది. నేను, నా నీడ ఇంటికి నడిచి వెళ్ళాము.

మరుసటి ఉదయం నేను ఒక విభిన్నమైన ఈల శబ్దానికి మేల్కొన్నాను అది నా కిటికీ బయట ఉన్న త్రష్ పక్షి పాట.

అదొక అద్భుతమైన రోజు, సూర్యరశ్మి వెచ్చగా, ఆహ్లాదకరంగా ఉంది. నాకు బయటకు వెళ్ళాలని తీవ్రంగా అనిపించింది. కానీ చేయవలసిన పని ఉంది, సరిదిద్దవలసిన ప్రూఫ్‌లు ఉన్నాయి, రాయవలసిన ఉత్తరాలు ఉన్నాయి. దేవదారు వృక్షాల కింద ఉన్న ఆ ఏకాంత, ప్రశాంతమైన విశ్రాంతి స్థలమైన ఆ కొండ శిఖరానికి నడిచి వెళ్ళడానికి నాకు ఇంకా చాలా రోజులు పట్టింది. తళతళలాడే మంచుతో కప్పబడిన శిఖరాలను అత్యుత్తమంగా చూసే అవకాశం ఉన్నవారందరూ కొన్ని అడుగుల భూగర్భంలో పాతిపెట్టి ఉండటం నాకు విడ్డూరంగా అనిపించింది.

కొన్ని మరమ్మతు పనులు జరుగుతున్నాయి. శ్మశాన వాటిక నిలుపుగోడకు ఆధారం కడుతున్నారు, కానీ పాడైపోయిన సమాధిని పునరుద్ధరించడానికి డబ్బు లేదని పర్యవేక్షకుడు నాకు చెప్పాడు. చౌకీదార్ సహాయంతో, నేను చెల్లాచెదురుగా పడి ఉన్న ఎముకలను కూలిపోయిన గోడల కింద ఉన్న ఒక చిన్న గుంతలో తిరిగి వేసి, తెరిచి ఉన్న సమాధిని ఇటుకలతో మూసివేయడానికి అతనికి కొంత డబ్బు ఇచ్చి వచ్చాను. సమాధి రాయిపై ఉన్న పేరు అరిగిపోయింది, కానీ నేను ఒక తేదీని గుర్తించగలిగాను 20 నవంబర్ 1950 సుమారు యాభై సంవత్సరాల క్రితం, కానీ కొన్ని సమాధి రాళ్లతో పోలిస్తే అది మరీ అంత పాతది కాదు.

నేను చర్చి వస్త్రశాలలో సమాధుల రిజిస్టర్‌ను చూశాను. పసుపు రంగులోకి మారుతున్న ఆ పేజీలను 1950వ సంవత్సరానికి తిప్పాను. అప్పుడు నేను కూడా కేవలం పాఠశాల విద్యార్థినే. అందులో నాకు ఆ పేరు కనిపించింది మైఖేల్ దత్తా, పదిహేనేళ్ల వయస్సు మరణానికి కారణం: రోడ్డు ప్రమాదం.

సరే, నేను కేవలం అంచనాలు మాత్రమే వేయగలిగాను. ఇక ఆ అంచనాలను నిజాలుగా మార్చుకోవాలంటే, ఆ అబ్బాయిని గానీ లేదా ఆ ప్రమాదాన్ని గానీ గుర్తుంచుకోగల బతికున్న వృద్ధులను ఎవరినైనా నేను కలుసుకోవలసి ఉంటుంది.

పైన్ టాప్‌లో వృద్ధురాలైన మిస్ మార్లే ఉండేవారు. వుడ్‌స్టాక్ నుండి పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయురాలైన ఆమెకు అద్భుతమైన జ్ఞాపకశక్తి ఉండేది, ఆమె అర్ధ శతాబ్దానికి పైగా ఆ కొండ ప్రాంతంలో నివసించారు. తెల్లటి జుట్టు, నునుపైన బుగ్గలతో, జిజ్ఞాసతో నిండిన తన ప్రకాశవంతమైన నీలి కళ్ళతో, ఆమె తన పాతకాలపు కళ్ళద్దాల నుండి నన్ను ప్రేమగా చూశారు.

"మైఖేల్ ఒక ఆకర్షణీయమైన బాలుడు ఉత్సాహవంతుడు, ఎల్లప్పుడూ సహాయం చేయడానికి సిద్ధంగా ఉండేవాడు. నాకు వార్తాపత్రిక కావాలన్నా, ఆస్పిరిన్ మాత్ర కావాలన్నా, చెప్పగానే, అతను వెంటనే తన సైకిల్‌పై బయలుదేరిపోయేవాడు. ఈ నిటారుగా ఉన్న కొండ రహదారులపై అతను అత్యంత నిర్లక్ష్యంగా, వేగంగా దూసుకుపోయేవాడు. ఈ కొండ ప్రాంతం దారులు, అకస్మాత్తుగా వచ్చే మలుపులతో కూడినవి, సైకిళ్లపై వేగంగా పరిగెత్తడానికి అనువైనవి కావు. అప్పుడు ఆ రహదారులను వెడల్పు చేస్తున్నారు. అవి మోటారు వాహనాల రాకపోకల కోసం సిద్ధమవుతున్నాయి. ఒక రోజు రాళ్లు, మట్టి శిథిలాలతో నిండిన ఒక ట్రక్ కొండపైకి ఎక్కుతూ వస్తుండగా, మైకేల్ ఒక మలుపు తిరిగి వచ్చి నేరుగా ఆ ట్రక్కును ఢీకొన్నాడు. అతడిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు, వైద్యులు తమ శాయశక్తులా ప్రయత్నించారు, కానీ అతడు స్పృహలోకి రాలేదు. అవును, మీరు అతని సమాధిని చూసే ఉంటారు. అందుకే మీరు ఇక్కడికి రాగలిగారు. అతని తల్లిదండ్రులు? వారు కొద్దికాలానికే విదేశాలకు వెళ్లారనుకుంటా. మైఖేల్ చూడటానికి చాలా మంచి అబ్బాయి, కానీ కాస్త అజాగ్రత్తపరుడు. నువ్వు కూడా అతడిని ఇష్టపడేవాడివి అనుకుంటున్నాను."

ఒకటి రెండు సార్లు అతని ఉనికిని నేను గమనించినప్పటికీ, కొంతకాలం పాటు ఆ మాయా సైకిల్ యాత్రికుడు నాకు మళ్ళీ కనిపించలేదు. ఇక ఒక చల్లని శీతాకాలపు సాయంత్రం, నేను ఆ నిర్మానుష్యమైన స్మశానం పక్కగా నడుచుకుంటూ వెళ్తున్నప్పుడు, అతను దూరంగా ఈల వేస్తున్నట్లు నాకు అనిపించింది. కానీ అతను కనిపించలేదు. బహుశా అది నా అస్పష్టమైన ఆలోచనల నీడలతో అనుసంధానమైన ఒక ఈల ప్రతిధ్వని మాత్రమే కావచ్చు.

ఆ నవ్వుతున్న ముఖాన్ని నేను మళ్ళీ చూడటానికి చాలా నెలలు పట్టింది. ఆ తర్వాత, కుండపోత వర్షాకాలంలో నేను ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా, పొగమంచులోంచి అది నాకు కనిపించింది. నేను పాత కమ్యూనిటీ సెంటర్‌లో జరిగిన ఒక విందుకు వెళ్లి, 'ఐబ్రో' అని పిలువబడే చాలా ఇరుకైన, నిటారుగా ఉండే దారి గుండా ఇంటికి తిరిగి వస్తున్నాను. ఆ సాయంత్రమంతా తుఫాను వచ్చేలా ఉంది. కొండ వాలుపై దట్టమైన పొగమంచు కమ్ముకుంది. అది ఎంత దట్టంగా ఉందంటే, నా టార్చ్‌లైట్ వెలుగు దానిపై నుండి పరావర్తనం చెందింది.

ఆకాశం మెరుపులతో వెలుగుతున్నాయిద, కొండల మీద ఉరుములు గర్జిస్తున్నాయి. వర్షం మరింత తీవ్రమైంది. నేను నెమ్మదిగా, జాగ్రత్తగా, కొండ వాలును ఆనుకుని ముందుకు కదిలాను. ఒక ఉరుము ఉరిమింది, ఆ తర్వాత పొగమంచులోంచి అతను బయటకు వచ్చి నా దారికి అడ్డంగా నిలబడటం చూశాను స్మశానం దగ్గర ప్రత్యక్షమైన అదే సన్నని, నల్లటి యువకుడు. అతను నవ్వలేదు. దానికి బదులుగా, అతను తన చేతిని పైకెత్తి నాకు చెయ్యి ఊపాడు. నేను సంశయంగా, కదలకుండా నిలబడిపోయాను. పొగమంచు కొద్దిగా తొలగిన తర్వాత చూస్తే, దారి మాయమయింది. నాకు కొన్ని అడుగుల ముందు ఒక పెద్ద గొయ్యి కనిపించింది. అది వంద అడుగులకు పైగా లోతుతో రాళ్ళతో.

నేను ఆసరా కోసం ఒక ముళ్లపొదను పట్టుకుని వెనక్కి అడుగు వేయగానే, ఆ అబ్బాయి మాయమయ్యాడు. నేను తడబడుతూ కమ్యూనిటీ సెంటర్‌కు తిరిగి వెళ్లి, గ్రంథాలయంలోని ఒక కుర్చీలో రాత్రంతా గడిపాను. నేను అతడిని మళ్ళీ చూడలేదు.

కానీ కొన్ని వారాల తర్వాత, నాకు తీవ్రమైన ఫ్లూ వచ్చినప్పుడు, నేను జబ్బుతో మంచం మీద ఉండగా, నా కిటికీ క్రింద నుండి అతను ఈల వేయడం విన్నాను. అతను నన్ను తనతో చేరమని పిలుస్తున్నాడా, లేక అంతా బాగానే అవుతుందని నాకు ధైర్యం చెప్పడానికి ప్రయత్నిస్తున్నాడా అని ఆలోచించాను. నేను మంచం మీది నుండి లేచి బయటకు చూశాను, కానీ ఎవరూ కనిపించలేదు. అప్పుడప్పుడు అతని ఈల వినపడేది; కానీ నా ఆరోగ్యం మెరుగుపడేకొద్దీ, అది క్రమంగా బలహీనపడి, చివరికి పూర్తిగా ఆగిపోయింది.

పూర్తిగా కోలుకుని, నేను మళ్ళీ ఆ కొండ పైకి నా పాత నడకలను మొదలుపెట్టాను. కానీ చీకటి పడేంత వరకు స్మశానం దగ్గరే ఉండిపోయినా, ఆ నిర్మానుష్యమైన దారిలో అటూ ఇటూ తిరిగినా, నాకు ఆ విజిల్ వేసే అబ్బాయి మళ్ళీ కనిపించలేదు, విజిల్ వినిపించలేదు. నాకు ఒంటరిగా అనిపించింది, ఒక స్నేహితుడు కావాలనిపించింది, అది కేవలం ఒక మాయా సైకిల్ తొక్కేవాడైనా సరే. కానీ అక్కడ చెట్లు తప్ప మరేమీ లేవు. అందుకే ప్రతి సాయంత్రం చీకటిలో ఇంటికి నడుస్తూ, ఆ పాత పల్లవిని పాడుకుంటూ వెళ్తాను:

"మేము ముగ్గురం,
మేము ఒంటరి కాదు,
మాకు తోడు కూడా లేదు
నా ప్రతిధ్వని,
నా నీడ,
నేను..."

# మేల్కొలిపే తటిల్లతలు




కొండ అద్దమందు కొంచమై ఉండదా అన్నాడు వేమన అద్దం లోని దృశ్యం కొండ స్వరూపాన్ని విశదపరుస్తుంది.పరమాణువులోనే విశ్వం ఉన్నట్లు సూక్ష్మం లో మోక్షం ఉంటుంది.సూక్ష్మాన్ని దాని గుణమైన క్లుప్తతను సాధించటం గగనం. క్లుప్తత క్షణం లోనే సారాంశాన్ని తెలుపుతుంది.క్లుప్తతను సాధించటం అసిధారావ్రతం తక్కువ పదాల్లో ఎక్కువ భావంపలికించటం గొప్ప సాధన పరిశీలన అవగాహన లతో అది పట్టు పడుతుంది అదొక శైలి గాస్థిరపడుతుంది "అల్పాక్షరాల్లో అనల్పార్థ రచన" అనాదిగా వస్తున్నదే ఈనాడు తటిల్లతలు పేరున కె ఆనందాచారి మరొక సారి ఆవిష్కరించాడు.

గాయం లోంచి వేదన వేదన నుంచి కవిత పుడుతుంది రామాయణం అలాగే పుట్టింది గాయం బారిన పడిన అనేకులు దులుపుకుని పోతుంటరు అలా వెళ్ళలేని వారే పదేపదే గాయపడుతు సృజన మార్గం పడుతుంటారు "మనం ఉన్నంత కాలం/గాయపడుతుంటాం "అని అంటారు నెమ్మదస్తులకు కూడా కోపం వస్తుంది కోపగొండి అరుస్తుంటడు కవి కరుణామయునితో చెప్పుకుంటడు అదొక విరోదాభాస అందులో నుండి కవిత పుష్పిస్తుందిలా "కరుణామయుడా/నన్ను క్షమించు/వాళ్ళేమి చేయుచున్నారో/వాళ్ళకు తెలుసు/వాళ్ళనిక క్షమించలేను" కాసిన పిందెల్లో కొన్ని రాలుతవి, మరికొన్ని ఎండుతవి, ఇంకొన్ని కాయలుగా తుంటరుల చేతుల్లో మరణిస్తవి పోగా మిగిలినవే పండి కడుపు నింపుతవి అలాగే ఇందులోని చాలా కవితలు చదువరుల కడుపు నింపాయి "మండేకాలం లోనూ/ఇంకిపోనివి/కన్నీళ్ళే"లాంటి కవితలు అనేకం సాధుజీవి నిరంతరం తనను తాను పుటంపెట్టుకుంటాడు ఆ క్రమం లో అంతర్మథనానికి ఇలా లోనవుతాడు "ఎందుకో/నేనెప్పుడూ ఒకింత/ఆలస్యమవుతుంటాను" ఇదొక లోచూపు"నిన్ను నీవు తెలుసుకో "అనే మార్గం.

వామనుడు పొట్టివాడు కార్యం సాధించిన గట్టివాడు గట్టి గింజల్లో జీవలక్షణం పుష్కలం ఈ లక్షణం గల కవిత ల్లో చైతన్యం, తత్త్వం, భావుకత తొణికిసలాడింది "అందాన్నెవడయినా/వర్ణిస్తాడు/లేదంటే ఆరాధిస్తాడు/వీడేమో కొలతలేస్తాడు/మార్కెట్లో/సరుకును చేస్తాడు"అనడం లో చైతన్యం మొగ్గ తొడిగింది చేస్తున్న పని వ్యక్తి ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందనడానికి "జీవితం/కవిత్వం లా/ఎడిటింగ్ కు/వీలవటం లేదు "అనే కవిత తార్కాణం "చెమ్మగిల్లు నయనమ్ము ఒకటి చాలు" అనే కవిత లో భావుకత చిప్పిల్లింది "నిశ్చింత అనుకోవడం ఒక భ్రమ" లాంటి కవితా పాదాలు తాత్వికత తో తొణికిసలాడాయి

ఈ కవి ఆధారపీఠం సంచారం సంచారి మనుషుల్లో కలిసి విషయాల్ని పెంచుకుంటూ, తెలుసుకుంటూ లోకార్పణం చేస్తాడు సామూహికత అర్థం మారిన వైనాన్ని ఇలా వివరించాడు "ఇపుడు/సామూహికత అంటే/పదుగురిలో నడవడం కాదు/చుట్టూ నలుగుర్ని/పోగేసుకొని తిప్పుకోవడం"

"మనసు బాగా లేకపోవడం/సరైన ప్రతి చర్యనే/బాగుండేందుకు/కావలసిన ఆవరణమే/నిర్మాణం కానపుడు" ఇందులో సామాజిక అసమానతల వల్ల కలిగిన సహజ మానవీయ స్పందన ను సమర్థించటం వల్ల వ్యక్తి కి ఊరడింపు, మెలకువ కలిగాయి దశాబ్దాల క్రితం దేవుణ్ణి, మనుషుల్ని ప్రేమించే వారు గుడి ప్రదక్షిణ చేసేవారు భక్తి, ప్రేమ రెండు కూడా మానవీయ అంశాలు నేడు గుడి చుట్టూ అశాంతి అసహనం ప్రదక్షిణ చేస్తున్నవి ఈ కవిత లో "ప్రేమ భక్తి/ప్రదక్షిణ చేసేవి/గుడి చుట్టూ నాడు/విద్వేషం అధికారం/తిరుగుతున్నాయి నేడు/అది వేడుకోలు/ఇది విలువల వీడుకోలు"నిశిత పరిశీలన ఉంటే తప్ప ఇలాంటివి రాయడం సాధ్యం కాదు.లఘు కవిత చెప్పి మెప్పించడం సులువు కాదు ఆ క్రమం లో కవి సహజంగా నే కొత్త దారులు, ప్రతీకలు వేస్తుంటడు నూటాఐదు కవితల్లో "కళ్ళనీడ"లాంటి కొత్త పదాలు కనిపించాయి బైలింగ్వల్ కవితా సంపుటాలు రావడం ఇది మొదలేం కాదు అరుదు కూడా తటిల్లతలు అనువాదం మూలకవితను అనుసరించి జరిగినది ఒక్కో చోట మూలాన్ని మించిన మెరుపు అనువాదం లో కనిపించినది శ్రీనివాస్ గౌడ్ మరియు గార్లు అభినందనీయులు



**బి.వి.ఎన్.స్వామి**
**9247817732**

## ఏడ్చాను

నా ఊపిరిలోకి నీ జ్ఞాపకం తొంగిచూసిన ప్రతిసారి
నీ కోసం నేను ఏడ్చింది ఒట్టి కన్నీళ్లతో కాదు
లోలోపలే ఎక్కడో కరిగిపోయిన
ఒక మంచుకొండలో కరిగి ఏడిచాను
సూర్యుడు ఉదయించినప్పుడూ
నీడలు సుదీర్ఘంగా పొడవైనప్పుడూ
అర్ధరాత్రి గడియారం కాలాన్ని నిలిపేసినప్పుడు
నా ఏడుపు మాత్రం చీకటికీ నిశ్శబ్దానికీ వినిపించింది
కురిసీ కురిసీ కన్నీళ్లు ఎండిపోయాక కూడా
నేను మనిషిలా ఇంకా ఏడవగలనని
నాకు నా కళ్లు కాదు, నా గుండె నేర్పింది
కన్నీళ్లు జలపాతంలా కురిసిన రోజులున్నాయి
చుక్క కూడా రాలని ఎడారి రోజులున్నాయి
కానీ ఆ రెండు రోజుల్లోనూ లోన వేదనే తడిసింది
నువ్వు రానేలేదు నడుస్తున్న కాలమే వచ్చి
నా భుజంపై చేయి వేసింది
ఎదురుచూపు కూడా
ఒక దీర్ఘ ప్రార్థనే అని అప్పుడు తెలిసొచ్చింది
ఇప్పుడు నేను నీ కోసం కాదు
నాలో ఇంకా మిగిలి ఉన్న
మనిషి కోసం ఏడుస్తున్నాను
ప్రతి కన్నీటి బిందువూ ఒక నదిగా మారి
దాహం తీర్చాలని
ప్రతి విడిపోవడమూ ఒక కొత్త కలయికకు
విత్తనమవాలని
నేను చనిపోయే రోజు వరకు
నేను ఈ ఏడవడాన్ని ఆపను
కానీ నా ఏడుపు
నీ కోసమో ఏ ఒక్క మనిషికోసమో కాదు
తమ కన్నీళ్లను దాచుకోవడం నేర్చుకున్న
ఈ ప్రపంచం కోసం
ఎందుకంటే కన్నీళ్లు
నాకే కాదు ఎవరికీ బలహీనత కావు
మనిషి ఇంకా
పూర్తిగా రాయిగా మారలేదనే
చివరి సాక్ష్యం కదా ఈ కన్నీళ్లు

**వారాల ఆనంద్**
**9440501281**

## జెన్ ఆల్ఫా

పిల్లగాడు కాదు చిచ్చర పిడుగు
బాలుడు కాదు అటం బాంబ్
వాడు ప్రశ్నల కొడవలి
వడిసెల రాయి
ఉవ్వెత్తున లేచిన కెరటం
ఎర్రనిపొద్దులా ఎరిపెక్కిండు!

ఆ గొంతును చూసి
దేశం ఉలిక్కిపడింది
విశ్వ గురువు వెన్నులో
వణుకు పుట్టింది
చిన్న గొంతులో
ఎంత ధిక్కారం
ఆరేళ్ల మెదడుతో
భవిష్యత్తు 'కల'గంటుండు!

ఆ చిన్న ముఖంలో
ఒక పూలే
ఒక అంబేద్కర్
ఒక భగత్ సింగ్
ఒక యుద్ధం సింగ్
ఒక కాన్సిరాం
కనబడుతుండు!

ఆలోచనలను
అరెస్టులు ఆపలేవు
ఆశయాలను
జైల్లో బంధించలేరు
బుద్ధ బెదిరింపులకు
జడసని గట్టోడు
బోధి వృక్షం వేర్ల నుండి
జ్ఞాన మొక్కై మొలిసిండు!

లాఠీలకు
తూటాలకు
భయపడకుండా
ప్రపంచం నివ్వెరపోయే
ప్రశ్నల వర్షమై కురిసిండు
ఈ దేశానికి దారి చూపే
జెన్ ఆల్ఫా!!

**ఎదిరెపల్లి కాశన్న**
**9640006304**

## చూపు

వర్షం
మట్టి వాసనతో వచ్చింది
ఎన్నో రోజుల దాహం తీర్చడానికి!

కిటికీ మీద పడుతున్న
వాన చినుకులు
పాత పాటలు పాడుకుంటున్నాయి.

అందరూ నిద్రపోతున్నారో
లేక నటిస్తున్నారో
అర్థం కావడం లేదు.

గుండెలో దాచుకున్న జ్ఞాపకాలతో
ఈ రోజు మనసారా తడవాలని వుంది.

వేసే ప్రతీ అడుగులో
కొత్త కథలు వినబడుతున్నాయి.

ఒంటరితనంతో
ఇప్పుడు నాకు స్నేహం కుదిరింది.

అమ్మ ప్రపంచం మొత్తాన్ని
భుజం మీద మోస్తే..
వెయ్యి మాటలు అవసరం లేని
ఒక అనుభవ పాఠం
జీవితాంతం
నన్ను వెంటాడుతూనే ఉంటుంది.

**ఏటూరి నాగేంద్రరావు**
**7416665323**

## త్రిమూర్తులు

ఆవరించిన అంధకారంలో అవతరించి
చైతన్యపు కిరణమైనవాడు బాపూజీ
కమ్ముకున్న చీకటిలో ఉదయించి
ఘీంకారపు రణమైనవాడు నేతాజీ
చుట్టుముట్టిన నిశిరాతిరిలో జన్మించి
స్వతంత్ర చరణమైనవాడు కాళోజీ

**కోటం చంద్రశేఖర్**
**9492043348**
(సెప్టెంబర్, 09 కాళోజీ జయంతి )




# రోడ్డు భద్రత అందరి బాధ్యత...

- ట్రాఫిక్ సిఐ ప్రమోద్ కుమార్..

**రాజేంద్రనగర్ మహా** : ఓఆర్ఆర్‌పై రోడ్డు భద్రత పై శంషాబాద్, ఓఆర్ఆర్ ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు ఐఆర్‌బీ అధికారులు సంయుక్తంగా రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలు ఓఆర్ఆర్‌పై వాహనాలను నిలపవద్దు, పార్కింగ్ చేయవద్దు అనే ముఖ్యమైన భద్రతా సూచనలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. అదేవిధంగా, వాహనదారులకు సురక్షితమైన డ్రైవింగ్ విధానాలు, ట్రాఫిక్ నిబంధనల పాటింపు, ఓఆర్ఆర్‌పై వాహనాలను నిలపకుండా ఉండటం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఓఆర్ఆర్‌పై ట్రాఫిక్ రాకపోకలు సజావుగా, సురక్షితంగా సాగేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని శంషాబాద్ ట్రాఫిక్ అధికారులు సూచించారు.




# గోదావరి పుష్కరాల భక్తుల కోసం డార్మెంటరీ నిర్మాణానికి రూ.1.50 కోట్లు

**సకాలంలో పనులు పూర్తి చేయాలి**
**భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** వచ్చే ఏడాది 2027 జూన్ జులై నెలలో నిర్వహించే గోదావరి పుష్కరాలకు భద్రాచలం వచ్చే భక్తుల సౌకర్యార్థం డార్మెంటరీ హాల్ నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తున్నామని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు తెలిపారు. గోదావరి పుష్కరాల కోసం భద్రాద్రి జిల్లాలోని దక్షిణ అయోధ్యగా పేరు ప్రఖ్యాతలు గడిచిన భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంకు విచ్చేసి భక్తుల కొరకు ఈ డార్మెటరీ హాల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగాభద్రాచలంలోని అమ్మ సత్రం ప్రాంతం వద్ద దేవాదాయధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ 1.50 కోట్ల వ్యయంతో "డార్మెంటరీ జి ప్లస్ వన్ భవన్ " నిర్మాణానికి ఆదివారం భూమి పూజ కార్యక్రమాలను నిర్వహించగా ముఖ్యఅతిథిగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొని మాట్లాడారు.గోదావరి పరివాహక ప్రాంతాలలో నిర్వహించే గోదావరి పుష్కరాలకు భక్తులు హాజరవుతారని ముఖ్యంగా భద్రాచలం పుణ్యక్షేత్రానికి దేశ నలుమూలల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారని తెలిపారు. భక్తులకు కనీస వసతులను కల్పించే ఉద్దేశంలో భాగంగా వారి వసతి కొరకు దేవాదాయ శాఖ తరపున ఈ డార్మెటరీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పది రోజులకు ఒకసారి అధికారులతో సమీక్ష సమావేశం ఈ పుష్కర పనులపై నిర్వహిస్తామని అధికారులు ఇది గమనించి పనిచేయాలని తెలిపారు. ఘాట్ నిర్మాణాలను ఇరిగేషన్ శాఖ అధికారులు త్రాగునీటి సరఫరాను ఆర్.డబ్ల్యూ.ఎస్ శాఖ అధికారులు రోడ్డు పనులను ఆర్ అండ్ బి శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనంతరం భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే గోదావరి పుష్కరాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తుందని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతాలలో ప్రారంభించిన ఘాట్ నిర్మాణాలతో పాటు డార్మెంటరీ నిర్మాణాలను సకాలంలో త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఏడు జిల్లాలో గోదావరి పుష్కర పనులు కొనసాగుతున్నాయని ముఖ్యంగా భద్రాచలంలో జరుగుతున్న పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగంగా సకాలంలో పూర్తి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం ఈ.ఓ దామోదర్, సర్పంచ్ పూనం కృష్ణ, ఉప సర్పంచ్ రత్నం కవిత, వార్డు సభ్యులు రమణ, కారం దుర్గారావు, వాణి తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన పై కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు

- భోరజ్ మండల కేంద్రంలో బైక్ ర్యాలీ

**ఆదిలాబాద్ మహా** : కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యిరోజుల పాలన సందర్భంగా భోరజ్ మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షులు బత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆదేశాలతో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు హాజరై మండల నాయకులతో కలిసి ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి మండల కేంద్రంలోని పలు వీధులు గుండా ర్యాలీ చేపట్టారు. వెయ్యి రోజులలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియచేసేందుకే సంబరాలు జరుపుతున్నట్టు సంతోష్‌రావు తెలిపారు. వెయ్యి రోజుల తమ ప్రభుత్వ పాలన పై బీఆర్ఎస్ నిరసన ప్రదర్శనలను ఆయన ఖండించారు. ప్రజల నుండి ప్రభుత్వానికి వస్తున్నస్పందన చూసి బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారన్నారు.కేసీఆర్ అసెంబ్లీ కి రాకుండా ఫాం హౌజ్ లో విశ్రాంతి తీసుకుంటూ శ్రేణులను ప్రభుత్వం పై రెచ్చగొడుతున్నారన్నారు. ఆయన అసెంబ్లీ కి రావాలని లేదంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు.ఇక స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఇందిరమ్మ ఇండ్లను కేంద్ర ప్రభుత్వానివిగా చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి నాయకత్వంలో పనిచేసి రానున్న ఎన్నికలలో ఆదిలాబాద్ లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొట్ట అశోక్, నిఖిలేష్, ఉష్కం శంకర్,నిమ్మల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ ఉద్యోగాల శిక్షణకు స్క్రీనింగ్ టెస్ట్

- జిల్లా వ్యాప్తంగా 1216 దరఖాస్తులు
- 1030 మంది అభ్యర్థులు స్క్రీనింగ్ టెస్ట్ కు హాజరు
- పరీక్ష కేంద్రంగా కొత్తగూడెం సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కాలేజ్
- పర్యవేక్షించిన ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**తెలంగాణ పోలీస్ శాఖలో కానిస్టేబుల్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ఉన్న నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించింది. జిల్లా వ్యాప్తంగా ఈ ఉచిత శిక్షణ కోసం 1216 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 1030 మంది స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరయ్యారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షా కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేశారు. పరీక్ష ప్రశాంతంగా క్రమబద్ధంగా పారదర్శకంగా జరిగేలా పోలీస్ అధికారులు పర్యవేక్షించారు.జిల్లాలోని ఐదు సబ్‌డివిజన్ల పరిధిలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. కొత్తగూడెం సబ్‌డివిజన్‌లో సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, పాల్వంచ సబ్‌డివిజన్‌లో అనుబోస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్స్, ఇల్లందు సబ్‌డివిజన్‌లో గవర్నమెంట్ హై స్కూల్ (జె.బి.ఎస్.), మణుగూరు సబ్‌డివిజన్‌లో శ్రీ చైతన్య టెక్నో హై స్కూల్, భద్రాచలం సబ్‌డివిజన్‌లో గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్‌ను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు కొత్తగూడెంలోని సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణను పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి పరీక్షా ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులకు సూచనలు చేశారు. పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్న యువతకు సరైన మార్గదర్శకత్వం నాణ్యమైన శిక్షణ అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. స్క్రీనింగ్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన అర్హులైన అభ్యర్థులకు కానిస్టేబుల్, సబ్‌ఇన్‌స్పెక్టర్ నియామక పరీక్షలకు అవసరమైన రాత పరీక్షతో పాటు శారీరక దారుఢ్య పరీక్షల్లో మెరుగైన ప్రతిభ కనబరిచే విధంగా సమగ్ర శిక్షణ అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తామని పేర్కొన్నారు.పోలీస్ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో పాటు క్రమశిక్షణ నిరంతర సాధన ఉంటే లక్ష్యాన్ని తప్పకుండా చేరుకోవచ్చని పేర్కొన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శిక్షణలో చురుకుగా పాల్గొని నియామక పరీక్షల్లో ప్రతిభ కనబరిచి పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణలో సబ్‌డివిజన్ పోలీస్ అధికారులు ఇన్‌స్పెక్టర్లు ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొని పరీక్షా ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- బంగారి గూడలో వనమహోత్సం
- మొక్కలు నాటిన కలెక్టర్ మున్సిపల్ చైర్ పర్సన్



**ఆదిలాబాద్ మహా**: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారానే భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించగలమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ,మున్సిపల్ చైర్ పర్సన్ మందారి అనూష అన్నారు. ఆదిలాబాద్ పట్టణ సమీపంలోని బంగారు గూడ మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటారు.చెట్లు ప్రాణవాయువును అందించడంతో పాటు వర్షపాతం పెరగడానికి, భూగర్భ జలమట్టాలు పెరగడానికి దోహదపడతాయని కలెక్టర్ తెలిపారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తమ ఇల్లు, పాఠశాల ఆవరణలో కనీసం ఒక్క మొక్కనైనా నాటి, అది మహా వృక్షంగా ఎదిగే వరకు క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా, నాటిన ప్రతి మొక్కను సంరక్షించి పెద్ద చెట్టుగా పెంచే బాధ్యతను కూడా తీసుకోవాలని ఆమె అన్నారు. హోమ్‌స్టెడ్ ప్లాంటేషన్ లో భాగంగా పూల మొక్కలను కూడా పంపిణీ చేస్తామని ఆమె తెలిపారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు.కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కలీమ్, వైస్ చైర్మన్ రోహిత్, మున్సిపల్ కమిషనర్ జగదీష్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బాసర ఆలయ సమగ్ర అభివృద్ధికి శ్రీకారం

- 354 కోట్లతో ఆలయ పునర్ నిర్మాణం
- 20 కోట్లతో పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులు
- మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష



**బాసర మహా :** తెలంగాణ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా వచ్చే ఏడాది జూన్ 27 నుంచి నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో విస్తృత ఏర్పాట్లు చేపడుతోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పుష్కరాలకు ఏడాది ముందుగానే మౌలిక వసతులు, పుష్కర ఘాట్లు, ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు.ఆదివారం బాసరలో పర్యటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పుష్కర ఘాట్ల నిర్మాణం, విస్తరణ, మరమ్మతులు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గోదావరి నదీమాతకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రూ.354 కోట్లతో చేపట్టనున్న ఆలయ సమగ్ర అభివృద్ధి, నూతన నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ ప్రాంగణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. భవిష్యత్‌లో పెరగనున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన మౌలిక వసతులను ముందుగానే ఏర్పాటు చేయాలని సూచించారు. గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తుల సౌకర్యం, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పుష్కర ఘాట్లను అవసరమైన మేరకు విస్తరించడంతో పాటు, కొత్త ఘాట్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టాలని అన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మహిళల కోసం ప్రత్యేక డ్రెస్సింగ్ రూములు, మరుగుదొడ్లు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రధాన పుష్కర ప్రాంతాల్లో 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, అవసరమైన వైద్యులు, అత్యవసర మందులు, అంబులెన్స్‌లను ముందుగానే సిద్ధంగా ఉంచాలని మంత్రి సూచించారు.భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీసు, రెవెన్యూ, దేవాదాయ, వైద్య, మున్సిపల్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అన్నారు. పుష్కర ప్రాంతాల్లో నిరంతర పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని, భక్తులకు నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

**అధికారులతో సమీక్ష**

ఆలయ ఈవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గోదావరి పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏడాది ముందుగానే పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పుష్కరాల కోసం దాదాపు రూ.1,000 కోట్లతో వివిధ అభివృద్ధి, మౌలిక వసతుల పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. పుష్కరాల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రజాభవన్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి జాప్యం లేకుండా పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. బాసరతో పాటు గోదావరి నదీ తీర జిల్లాల్లోని మొత్తం 12 ప్రాంతాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. పుణ్యస్నానాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఘాట్ల అభివృద్ధితో పాటు భద్రతా చర్యలను పటిష్ఠం చేయనున్నట్లు చెప్పారు. పుష్కరాల కోసం చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. పనుల నాణ్యత, పురోగతిని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఐఏఎస్ అధికారిని నియమించినట్లు వెల్లడించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.పుష్కరాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించాలని మంత్రి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా బాసర గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, పుష్కర ఘాట్ల అభివృద్ధి, శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన మ్యాపులు, ప్రతిపాదనలు, పనుల పురోగతిని మంత్రి జూపల్లి కృష్ణారావుకు వివరించారు. నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసి, పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, ఆలయ ఈవో అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ మోసాల పట్ల జాగ్రత్త ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్ మహా:** ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులు పంపించే సందేశాలు, లింకులు, పెట్టుబడి అవకాశాలు, ఆన్‌లైన్ ప్రకటనలు, ఫోన్ కాల్స్‌ను నమ్మి డబ్బులు పంపవద్దని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో సూచించారు. ప్రతి ఆన్‌లైన్ లావాదేవీని జాగ్రత్తగా పరిశీలించి, నిర్ధారించుకున్న తర్వాతనే నగదు బదిలీ చేయాలని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో ఈ వారం వివిధ రకాల సైబర్ నేరాలకు సంబంధించి 10 ఫిర్యాదులు అందినట్లు, వాటిపై సంబంధిత పోలీస్ స్టేషన్ల పరిధిలో దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల్లో ప్రజలను మోసం చేస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు ఇన్వెస్ట్‌మెంట్ ,ఆన్‌లైన్ షాపింగ్, నకిలీ గేమింగ్ యాప్ ,క్రెడిట్ కార్డు వివరాలు ఓటీపీ, ఓఎల్ఎక్స్ లో మొబైల్ ఫోన్ ప్రకటన, డీలర్‌షిప్ ,నకిలీ లోన్ యాప్ తదితర సైబర్ నేరాలు జరిగినట్టు తెలిపారు. జిల్లా ప్రజలు ఓటీపీ, పిన్, సీవీవీ, యూపీఐ పిన్ క్రెడిట్ ,డెబిట్ కార్డు వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. గుర్తుతెలియని లింకులు, యాప్‌లు, పెట్టుబడి అవకాశాలు, ఆన్‌లైన్ ప్రకటనలు లోన్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. త్వరగా ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలుపుదల చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.



# నూతన జీఎంకు ఐఎన్‌టీయూసీ నేతల శుభాకాంక్షలు

**సత్తుపల్లి, సెప్టెంబరు 6:మహా** : సత్తుపల్లి ఏరియా నూతన జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటాచారిని ఐఎన్‌టీయూసీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏరియా వైస్ ప్రెసిడెంట్ బి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్ నూతన జీఎంను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఏరియా అభివృద్ధి, ఉత్పత్తి-ఉత్పాదకత పెంపుతో పాటు కార్మికుల సంక్షేమం, ఉద్యోగుల సమస్యల పరిష్కారం తదితర అంశాలపై జీఎంతో నాయకులు చర్చించారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ఏరియా అభివృద్ధి కోసం యాజమాన్యానికి కార్మిక సంఘాల తరపున సహకారం అందిస్తామని తెలిపారు. పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ సెక్రటరీలు నాగప్రకాష్, మురళీకృష్ణ, పిట్ సెక్రటరీలు షణ్ముఖచారి, నగేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాం ను తనిఖీ చేసిన వరంగల్ జిల్లా కలెక్టర్

**వరంగల్, ఎనుమాముల మహా** : త్రైమాసిక తనిఖీలో భాగంగా ఆదివారం ఎనుమాముల మార్కెట్ యార్డులోని ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా గోదాంలో అమలులో ఉన్న భద్రతా చర్యలు, నిర్వహణ ఏర్పాట్లు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు.ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. తనిఖీ లో డియార్వో విజయలక్ష్మి , వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

**ఆదిలాబాద్ మహా** : పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల డైట్ కళాశాలలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. శిక్షణ కేంద్రంలో జరుగుతున్న వివిధ విభాగాల పనితీరును, రికార్డులను ఆయన నిశితంగా పరిశీలించారు. తనిఖీలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పక్కాగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు, ఎదురయ్యే సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ జగదీశ్వర్, తహసిల్దార్ శ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## తాపీ కార్మిక సంఘం ఎన్నికల్లో సంకరి కృష్ణ, యెలుగం శ్రీనివాస్ లు ఘనవిజయం.

**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి పట్టణంలో తాపీ కార్మిక సంఘం ఎన్నికలు ఆదివారం నాడు ఉత్కంఠ భరితంగా సాగగా రెండు ప్రధాన వర్గాలుగా విపోటీలో నిలిచి అసెంబ్లీ ఎన్నికలు తలపించే విధంగా రెండు ప్రధాన వర్గాలు పోటీ పడగా గత 15 రోజులుగా ఎంతో విస్తృతతంగా ప్రచారాన్ని కొనసాగించారు. బెల్లంపల్లి పట్టణంలోని తాపీ కార్మిక సంఘం ఎన్నికలు, తాఫీ కార్మిక సంఘం భవనంలో ఆదివారం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు మధ్య ఆదివారం నాడు ప్రశాంతంగా ముగిశాయి. జరిగిన ఎన్నికల్లో ఒక వర్గం నుండి అధ్యక్షునిగా సంకరి కృష్ణ,ప్రధాన కార్యదర్శి ఎలుగం శ్రీనివాస్ లు ప్యానల్ పోటీ చేయగా, మరో ప్యానల్ నుండి ప్రత్యర్థులుగా అధ్యక్షునిగా దాసరి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి గా కాసర్ల పెద్దులు పోటీ చేశారు . బెల్లంపల్లి తాపీ కార్మిక సంఘం ఎన్నికలలో మొత్తం 621 ఓట్లు ఉండగా ఆదివారం నాడు నిర్వహించిన ఎన్నికల్లో 556 ఓట్లు పోలైనట్లు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించిన రిటైర్డ్ ఉపాధ్యాయులు నరసయ్య, పోచన్న, వైకుంఠం, ప్రభాకర్ లో వెల్లడించారు .జరిగిన ఎన్నికల్లో అధ్యక్షునిగా సంకర కృష్ణ తన సమీప ప్రత్యర్థి దాసరి శ్రీకాంత్, పై 58 ఓట్ల మెజారిటీతో విజయం సాధించగా, ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసిన ఎలుగం శ్రీనివాస్ తన సమీప ప్రత్యర్థి కాసర్ల పెద్దులు పై 106 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మొత్తం 621 ఓట్లకు గాను 556 ఓట్లు పోలు కాగా అధ్యక్షులు సంకరి కృష్ణకు 293 ఓట్లు రాగా దాసరి శ్రీకాంత్ కు 235 ఓట్లు, చెల్లని ఓట్లు 28 పోలయ్యాయి, 58 ఓట్ల మెజారిటీతో సంకర కృష్ణ గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. కార్యదర్శిగా గెలుపొందిన ఎలుగం శ్రీనివాస్ కు 316 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి కాసర్ల పెద్దులు కు 210 వచ్చాయి, 30 ఓట్లు చెల్లకుండా పోగా, 106 ఓట్ల మెజార్టీతో ఎలుగం శ్రీనివాస్ గెలుపొందారు. ఈ సందర్భంగా జరిగిన తాపీ సంఘ ఎన్నికల్లో అ కార్యదర్శులు సుంకరి క్రిష్ణ, ఎలుగం శ్రీనివాసులు మాట్లాడుతూ తాపీ కార్మిక సంఘం కార్మికుల సంక్షేమానికి మరియు అభివృద్ధికి కృషి చేస్తామని సంయుక్తంగా ప్రకటించారు. ఎన్నికల్లో గెలుపు ఓటమిలు సహజమని, అందరం కలిసి సంఘ అభివృద్ధి కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు.త్వరలోనే పూర్తి స్థాయిలో కమిటీని అందరి కమిటీ సభ్యుల సహాయ సహకారాలతో ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. తమ గెలుపు కోసం అహర్నిశలు కృషిచేసిన మాజీ అధ్యక్షులు ఆవుల కొమురయ్యకు, తాడశెట్టి రామ్ కుమార్, తాడిశెట్టి సురేష్ తదితర సీనియర్ ప్రతినిధులకు, ఓటు వేసి గెలిపించిన సంఘ సభ్యులకు పోలీసు సిబ్బందికి, పత్రికా ప్రతినిధులకు, పేరుపేరు ధన్యవాదాలు తెలిపారు.అనంతరం పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, సంఘ ప్రతినిధులు, గెలుపొందిన అభ్యర్థులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.



## ఉచిత కోచింగ్‌కు 201 మంది ప్రవేశ పరీక్ష...

- ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు పోలీసుశాఖ చేయూత
- 4 మండలాల నుంచి హాజరైన నిరుద్యోగులు
- పరీక్షను పర్యవేక్షించిన సీఐ నాగబాబు

**మణుగూరు, మహా :**పోలీస్ శాఖలో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ఉచిత కోచింగ్ అందించేందుకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆదివారం మణుగూరులో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు, డీఎస్పీ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక చైతన్య పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన ఈ పరీక్షకు నాలుగు మండలాల నుంచి 201 మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరయ్యారు. ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ అందించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. పరీక్ష కేంద్రంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారు. ప్రవేశ పరీక్ష నిర్వహణను సీఐ నాగబాబు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ నాగబాబు అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు సరైన మార్గదర్శకత్వం, శిక్షణ అందించి ఉద్యోగ సాధనలో తోడ్పడటమే ఉచిత కోచింగ్ ముఖ్య ఉద్దేశమన్నారు. అభ్యర్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో, పట్టుదలతో సిద్ధమైతే పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని సూచించారు. పోలీసుశాఖ కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగం సాధించేందుకు శ్రమించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ నాగబాబులతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అసెంబ్లీకి రాని కేసీఆర్ రాజీనామా చేయాలి..


- ప్రతిపక్ష నేతగా ప్రజల గొంతుక వినిపించాలి
- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు
- మణుగూరులో భారీ ర్యాలీ, రాస్తారోకో




**మణుగూరు, మహా :** ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావించకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమవుతున్న మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్రజలు అప్పగించిన బాధ్యతను నిర్వర్తించకుండా ప్రతిపక్ష నేత పదవిలో కొనసాగడం సమంజసం కాదన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకాకపోవడాన్ని నిరసిస్తూ ఆదివారం మణుగూరులో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. క్యాంపు కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన పదవి ఫామ్‌హౌస్‌లో కూర్చోవడానికి కాదని, వారి తరఫున అసెంబ్లీలో గొంతుక వినిపించడానికి అని అన్నారు. ప్రతిపక్ష నేతగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉందన్నారు. అసెంబ్లీకి రాకుండా ప్రజల గొంతుక ఎలా అవుతారు? అని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రస్తుతం ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు దూరంగా ఉండటం సరికాదన్నారు. ప్రతిపక్ష నేత పదవి అలంకారప్రాయం కాదని, ప్రజల సమస్యలను సభలో ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీసే కీలక బాధ్యత అని పేర్కొన్నారు. బయట నుంచి రాజకీయ విమర్శలు చేయడం కాకుండా ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలను తెలుసుకుని అసెంబ్లీలో ప్రస్తావించాలని సూచించారు. ప్రజలు మీకు ఓటు వేసింది ఫామ్‌హౌస్‌లో ఉండటానికి కాదు.. అసెంబ్లీకి వచ్చి ప్రజల గొంతుకగా నిలబడటానికి అని పాయం వ్యాఖ్యానించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి కేసీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలని, ప్రతిపక్ష నేతగా బాధ్యతలు నిర్వర్తించలేని పక్షంలో పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో పాటు స్థానిక సర్పంచులు, ఉపసర్పంచులు, మండల అధ్యక్షులు, మండల కార్యదర్శులు, పట్టణ అధ్యక్షులు, యూత్ అధ్యక్షులు, మహిళా నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి హాజరై ప్రతిపక్ష నేతగా బాధ్యతలు నిర్వర్తించాలని నినాదాలు చేశారు.

# తుమ్మల చెరువుకు గోదావరి జలాలు..

- విజయవంతమైన మారెళ్లపాడు లెఫ్ట్ కెనాల్ ట్రయల్ రన్
- సాకారం దిశగా రైతుల చిరకాల సాగునీటి కల
- ఎమ్మెల్యే పాయం చొరవతో కీలక ముందడుగు



**అశ్వాపురం/మణుగూరు, మహా :** అశ్వాపురం మండలంలోని తుమ్మల చెరువు ఆయకట్టు రైతుల చిరకాల సాగునీటి కల సాకారం దిశగా కీలక ముందడుగు పడింది. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవతో చేపట్టిన మారెళ్లపాడు లెఫ్ట్ కెనాల్ ట్రయల్ రన్ ఆదివారం విజయవంతమైంది. దీంతో ఏళ్లుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. గోదావరి జలాలను మారెళ్లపాడు లెఫ్ట్ కెనాల్ ద్వారా తుమ్మల చెరువుకు తరలించి ఆయకట్టు భూములకు సాగునీరు అందించాలన్నది ఈ ప్రాంత రైతుల చిరకాల ఆకాంక్ష. దీనిని సాకారం చేసేందుకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ పనులను ముందుకు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆదివారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతం కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

**రైతులకు పండుగ రోజు**

కెనాల్‌లో గోదావరి జలాల ప్రవాహాన్ని చూసిన రైతుల ముఖాల్లో ఆనందం కనిపించింది. ట్రయల్ రన్ విజయవంతమైన సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అధికారులు, సిబ్బందికి రైతులు స్వీట్లు పంచి సంతోషాన్ని పంచుకున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సాగునీటి కల నెరవేరే రోజు దగ్గర పడిందని రైతులు పేర్కొన్నారు. గోదావరి జలాలు మా పొలాలకు చేరి పచ్చని పంటలు పండితే అంతకంటే ఆనందం మరొకటి ఉండదు. ట్రయల్ రన్ విజయవంతం కావడం రైతులందరికీ పండుగ రోజు అని పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేశారు. మారెళ్లపాడు లెఫ్ట్ కెనాల్ ద్వారా తుమ్మల చెరువుకు గోదావరి జలాలు చేరితే ఆయకట్టు పరిధిలో సాగునీటి ఇబ్బందులు గణనీయంగా తగ్గనున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు పంటలకు నీటి భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, తుమ్మల చెరువు ఆయకట్టు రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.





### జీవన సమరంకై...
# వీధి కెక్కిన బాల్యం

- పస్తులు ఉండలేక... పనికోసం కొబ్బరి కుడుకల వ్యాపారం.
- పొట్టకూటి కోసం జవహర్ నగర్ వలస పేదల జీవన పాట్లు.

**జవహర్ నగర్, మహా : .**జీవన సమరంకై... కొబ్బరి కుడుకల వ్యాపారం చేసుకుంటూ సగం పూట పస్తులు ఉంటూ... దూర ప్రాంతాలైన ఆంధ్ర తెలంగాణ నుండి హైదరాబాదులోని జవహర్ నగర్ కు వలస వచ్చారు. రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు వారిని. కొబ్బరి కుడుకలు అమ్ముకునే జీవించే వారి జీవితం చాలా శ్రమతో ఒడి దొడుగులతో కూడి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాల వరకు ఎంతో మంది చిన్న వ్యాపారులు వీధి వ్యాపారాలు ఈ వృత్తిపైనే ఆధారపడి తమ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కఠినమైన శ్రమ తెల్లవారుజాము నుండి ప్రారంభం: వీరు తెల్లవారుజాము నుండి లేచి ప్రతి బజారు వీధుల వెంబడి తిరుగుతూ కొబ్బరి కుడుకలను కొనుగోలు చేస్తారు. వీరి జీవితం చాలా దుర్భరంగా ఉంటుంది. తాము నమ్ముకున్న వృత్తిని గౌరవిస్తూ కష్టపడి పనిచేసి పిల్లలను చదివించుకుంటున్నారు. సమాజంలో వీరికి పెద్దగా గుర్తింపు లేకపోయినా ప్రతి ఇంట్లో జరిగే వివిధ రకాల పూజలు మిగిలిపోయిన కొబ్బరి కుడుకలను సేకరించుకొని అమ్మి జీవితాన్ని కొనసాగిస్తున్నారు. వీరి శారీరక శ్రమ రోజంతా ఎండనకా వాననకా సైకిల్ మీద వెళ్లి వీధి వీధి తిరుగుతూ అలసట అయ్యేంతవరకు తిరిగి సేకరించిన కొబ్బరి కుడుకలను తెచ్చి మార్కెట్లో అమ్మితే వీరికి మిగిలేది కొంచమే. అయినా వీరు తమ వ్యాపారాన్ని యధావిధిగా కొనసాగిస్తున్నారు. ఆదాయంలో అస్థిరత వీరు రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు తిరిగినా రోజువారీ ఖర్చులకు సరిపడా ఆదాయం రావడం కూడా గగనమే అవుతుంది. వర్షాకాలంలో కొబ్బరి కాయలను కొబ్బరి కుడుకలను ఎండబెట్టడం చాలా కష్టం తేమ వల్ల కుడకలు బూజు పట్టి పాడైపోతే వారికి భారీ నష్టం వస్తుంది. అసలే సీజన్లో వ్యాపారాలు లేక అల్లాడుతుంటుంటే, పిల్లలను కూడా ఈ వ్యాపారులు ఈ వృత్తిలోకి దింపుతూ తమ బడి ఈడు బాల్యాన్ని వ్యర్థ పరుస్తున్నారు. పేదరికానికి తోడు తమ జీవన భృతి కై తమ పిల్లలను కూడా ఈ కొబ్బరి కుడకల వ్యాపార వృత్తిలోకి దించుతున్నారు. ఈ బాలలు కొబ్బరి కుడకల సేకరణకై రోజు ఉదయాన్నే సైకిల్ మీద ఎండనకా వాననక తిరుగుతూ కొబ్బరి కుడుకలను సేకరించి తమ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం వీధి వ్యాపారులను ముఖ్యంగా కొబ్బరి కుడుకలను సేకరించుకొని జీవించే వారికోసం వివిధ పథకాలను ప్రవేశపెట్టి వారి సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలని కోరుకుంటున్నారు. ఆపరేషన్ ముస్కాన్ పథకం కింద పిల్లలను బడికి పంపి వారికి తగిన విద్యా సౌకర్యాలను కల్పించి విద్య హక్కు చట్టం ప్రకారం 14 ఏళ్ల లోపు ఉన్న పిల్లలందరికీ ఉచిత విద్య కల్పించాలని జవహర్ నగర్ ప్రజలు కోరుకుంటున్నారు.

**ప్రత్యామ్నాయ మార్గాలు చూపండి:**
పని కోసం హైదరాబాద్ వచ్చాము. ఇక్కడ ఏ పనులు సరిగ్గా దొరకటం లేదు. విధి లేని పరిస్థితుల్లో కొబ్బరి కుడుకల వ్యాపారం లోకి దిగాం. సేకరించి తెచ్చిన పగిలిన కొబ్బరి కాయల కుడుకలను కొబ్బరి చిప్పల నుండి వేరుచేసి హోల్ సేల్ వ్యాపారులకు అమ్మినా గాని రోజు కూలి కూడా గిట్టుబాటు కావడం లేదు. **ప్రభుత్వ మమ్మల్ని ఆదుకోవాలి. నాగరాజు ( ప్రగతి నగర్).**

**స్కూలుకెళ్లాలని ఆశగా ఉంది:** నా పేరు సతీష్ మాది ఆలేరు దగ్గరలోని ఒక కుగ్రామం. పొట్టకూటికోసం అమ్మానాన్నలతో హైదరాబాదులోని జవహర్ నగర్ కు వచ్చాము. మాకు ఇల్లు గడవడం కష్టంగా ఉంది. నాన్న ఆదేశంతో ఉదయమే కొబ్బరి కుడుకల సేకరణకై సైకిల్ మీద ప్రతి వీధి వీధినా తిరిగి పంచదార ఇచ్చి కొబ్బరి కుడుకలను సేకరిస్తా
**(సతీష్, కొబ్బరి కుడుకలు సేకరించే బాలుడు. జవహర్ నగర్).**



## క్రీడా ప్రాంగణానికి చెత్త కుప్పగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

**బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి**

**మొయినాబాద్ మహా:** క్రీడా ప్రాంగణాలన్నిటిని చెత్తకుప్పలతో కాంగ్రెస్ ప్రభుత్వం మార్చేసిందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ రెవెన్యూ లోని డంపింగ్ యార్డు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నాటి కెసిఆర్ ప్రభుత్వ హయాంలో పచ్చని ఆహ్లాదకరమైన వాతావరణంలో క్రీడా ప్రాంగణాలను కెసిఆర్ హయాంలో ఏర్పాటు చేస్తే.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి హయాంలో చెత్తకుప్పలుగా మార్చారని ఆయన విమర్శించారు. డంపింగ్ యార్డు వలన స్థానిక ప్రజలు అనేక రోగాల పాలవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి డంపింగ్ యార్డును తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ దేశముల్ల ఆంజనేయులు, కొత్త నరసింహారెడ్డి, కోట్ల నరోత్తం రెడ్డి, రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న సతీశ్, సుధాకర్ యాదవ్, ముదిగొండ రవియాదవ్, షాబాద్ శ్యాంరావు, నరసింహ గౌడ్, తిరుపతిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు మోర శ్రీనివాస్, కౌన్సిలర్ కర్రోల్ల శ్రీధర్, కొర్ర గోపాల్ నాయక్, జేల్లెల్ల మల్లేష్ యాదవ్, హాజీ, బీఆర్ఎస్ మొయినాబాద్ మండల యూత్ ఉపాధ్యక్షుడు వడ్ల కాళిదాస్ చారి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## బిల్డింగ్ లో షార్ట్ సర్కిట్ తప్పిన ప్రమాదం

**మొయినాబాద్ మహా:**
ఆదివారం ఉదయం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ లేడీస్ హాస్టల్ బిల్డింగ్ లో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో పెద్ద పెద్ద మంటలు ఎగిసిపడ్డాయి. వివరాల్లోకి వెళితే మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్ నగర్ చౌరస్తాలోని ప్రవేట్ శ్రీలక్ష్మీ డీలక్స్ లేడీస్ హాస్టల్ బిల్డింగ్ లో ఆదివారం ఉదయం సుమారు 5 నుండి 6గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి వైర్లు కాలిపోయి పెద్ద ఎత్తున మంటలు వచ్చాయి. ఈ ప్రమాదంలో అక్కడ ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగలేదు. ప్రమాదం జరిగిన బిల్డింగ్ లో ఉన్న శ్రీ లక్ష్మీ డీలక్స్ లేడీస్ హాస్టల్ లో సుమారు 100 మందికి పైగా విద్యార్థులు ఉంటారని స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో ఎవరు లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పరిశీలించిన టీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కుమ్మరి పవన్ కుమార్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో జరిగిన ప్రమాదాన్ని టీఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మండల యూత్ అధ్యక్షుడు కుమ్మరి పవన్ కుమార్ శ్రీ లక్ష్మీ డీలక్స్ లేడీస్ హాస్టల్ లో జరిగిన సంఘటన సమాచారం తెలుసుకొని హాస్టల్ ప్రాంతాన్ని సందర్శించారు. హాస్టల్ నిర్వాహకులతో మాట్లాడి ఉదయం జరిగిన సంఘటనపై అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్త పడాలని సూచించారు.



## రోడ్ల మీద కాదు.. అసెంబ్లీకి వస్తే
# సమాధానమిస్తాం

- **కేసీఆర్ సభకు వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి.**
- **బీఆర్ఎస్ ఇదే వైఖరి కొనసాగిస్తే మరికొంతకాలం రోడ్లపైనే ఉండాలి.**
- **మంత్రి శ్రీధర్‌బాబు**

**హైదరాబాద్, మహా.** రోడ్లపై మాట్లాడటం, ధర్నాలు చేయడం కాదు.. అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే మేము సమాధానం చెబుతాం'' అని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. తెలంగాణలో ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకత్వం పక్కదారి పడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం జవాబుదారీతనంతో పనిచేస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని సూచించారు.ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. రానున్న అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో బీఆర్ఎస్ వ్యవహరిస్తున్న తీరుపై ఆయన స్పందించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు అసెంబ్లీ వేదికగా ఉన్నప్పటికీ.. బీఆర్ఎస్ నేతలు రోడ్లపై మాట్లాడటం, ధర్నాలు చేయడానికే పరిమితమవుతున్నారని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం జవాబుదారీతనంతో పనిచేస్తోందని శ్రీధర్‌బాబు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు. రేషన్ కార్డులు ఇస్తామని చెప్పామని, చెప్పినట్టుగానే అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేశామని తెలిపారు. పార్టీలు, రాజకీయ భేదాలు చూడకుండా అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తున్నామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు రేషన్ కార్డులు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని శ్రీధర్‌బాబు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనిని కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిస్తోందని అన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ సౌకర్యాన్ని బీజేపీ, బీఆర్ఎస్ నేతలు వినియోగించుకోవడం లేదా? అని ప్రశ్నించారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఆయన తప్పుబట్టారు.బీఆర్ఎస్, బీజేపీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నాయని శ్రీధర్‌బాబు ఆరోపించారు. విపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గమనించాలని కోరారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని శ్రీధర్‌బాబు హితవు పలికారు. శాసనసభలో ప్రతిపక్షానికి ఉన్న అవకాశాలను ఉపయోగించుకుని ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నలు అడగాలని సూచించారు. రోడ్లపై విమర్శలు చేయడం కంటే సభలో ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.కేటీఆర్, హరీశ్‌రావులు ప్రస్తుత ప్రభుత్వాన్ని ప్రశ్నించే ముందు.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఇదే అంశాలపై నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎందుకు ప్రశ్నించలేదని శ్రీధర్‌బాబు మండిపడ్డారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు తీసుకున్న నిర్ణయాలు, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేస్తున్న విమర్శలపై ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు.




# జిల్లాలో ఘనంగా ఇనగాల జన్మదిన వేడుకలు

- **కార్యకర్తలే నా బలం**
- **నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి**
- **హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి**
- **రక్తదాన శిబిరాల్లో 320 మంది రక్తదానం**
- **రక్తదాతలకు సర్టిఫికెట్లు, ఇనగాల ట్రస్ట్ టీ షర్ట్స్ పంపిణీ**

**హన్మకొండ,మహా ;** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నన్ను అభిమానించే అభిమానులే తన బలమని హనుమకొండ జిల్లా డీసిసి అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. కార్యకర్తలు అభిమానులు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నియోజకవర్గ అభ్యున్నతికి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. తన 58వ జన్మదినాన్ని పురస్కరించుకుని పరకాల నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా రక్తదానం, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టారు. రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు ముందుకు వచ్చిన యువతను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.గీసుకొండ మండలంలోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో సంగెం, గీసుకొండ మండలాల తోపాటు 15, 16, 17 డివిజన్ల కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువత సంయుక్తంగా ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇనగాల ఛారిటబుల్ ట్రస్ట్, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి 320 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారని తెలిపారు. రక్తదానం చేసిన వారికి ఇనగాల ఛారిటబుల్ ట్రస్ట్ తరఫున ప్రత్యేకంగా రూపొందించిన టీ షర్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాతలకు ధ్రువపత్రాలను కూడా అందించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ప్రజాప్రతినిధులు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ భద్రకాళి ఆలయాన్ని సందర్శించిన వరంగల్ సీ.పి, ఏపీ దేవాదాయ అడిషనల్ కమిషన్

**వరంగల్,మహా ;** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ అడిషనల్ కమీషనర్ చంద్రశేఖర్ ఆజాద్ ఆలయాన్ని నందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆజాద్‌కు ఆలయ ఈఓ రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆజాద్ ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ప్రధానార్చకులు భద్రకాళి శేషు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేష వస్త్రాలు బహూకరించి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆజాద్ వెంట మాజీ కార్యనిర్వహణాధికారులు, జ్ఞానదేవ్ రెడ్డి, రాజేంద్రం తో పాటు మేడారం ఈ.ఓ యం. వీరస్వామి, రత్నాకర్ శర్మ తదితరులున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న సీపి కుటుంబం అనంతరం వరంగల్ పోలీస్ కమీషనర్ శ్వేత ఐపీఎస్ కుటుంబ నతమేతంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం సి.పి కుటుంబ సభ్యులకు అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించారు. ఆదివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ కార్య నిర్వహణాధికారి రామల సునీత తెలిపారు.

# వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలి

- **శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించొద్దు**
- **రౌడీషీటర్ల కు ఇన్‌స్పెక్టర్ మంగీలాల్ హెచ్చరిక**



**వరంగల్, క్రైమ్ మహా ;**రాబోయే వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మిల్స్ కాలనీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మంగీలాల్ రౌడీషీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మంగీలాల్ మాట్లాడుతూ వినాయక చవితి పండుగను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకునేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సూచించారు. పండుగ సందర్భంగా గణేష్ మండపాల ఏర్పాటు, ప్రత్యేక పూజలు, ఊరేగింపులు, నిమజ్జనం కార్యక్రమాల సమయంలో ఎలాంటి గొడవలు, అల్లర్లు లేదా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని రౌడీషీటర్లను హెచ్చరించారు. ముఖ్యంగా పాత నేర చరిత్ర కలిగిన వ్యక్తులు పోలీసుల నిఘాలో ఉంటారని, పండుగను ఆసరాగా చేసుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన, గొడవలకు దిగినా లేదా ఇతరులను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించిన చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అదేవిధంగా మద్యం సేవించి బహిరంగ ప్రదేశాల్లో హంగామా చేయడం, యువతను రెచ్చగొట్టడం, గణేష్ మండపాల వద్ద గొడవలకు పాల్పడటం, ఊరేగింపుల సమయంలో శాంతిభద్రతలకు భంగం కలిగించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తెలిపారు. పండుగ సందర్భంగా ఎలాంటి వివాదాలు, ఘర్షణలకు తావివ్వకుండా సమన్వయం పాటించాలని సూచించారు.గణేష్ నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా, పోలీసుల సూచనలు మరియు నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఇన్‌స్పెక్టర్ మంగీలాల్ తెలిపారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పండుగ సందర్భంగా పోలీస్ సిబ్బందితో నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని, ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తే వారి పై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వినాయక చవితి నిమజ్జనం కార్యక్రమాలను ప్రజలందరూ శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించుకొని పోలీస్ శాఖకు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ మంగీలాల్ కోరారు.

# విద్యార్థులకు మెరుగైన విద్యా, వసతి సౌకర్యాలు అందించాలి

- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్**
- **రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్**



**వరంగల్, నెక్కొండ మహా** : వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ తో పాటు జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. సందర్భంగా పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా, వసతి సౌకర్యాలను పరిశీలించారు.

కలెక్టర్ తరగతి గదులను సందర్శించి విద్యార్థులకు జరుగుతున్న బోధన, వారి అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారు చదువుతున్న విషయాలు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసతి గదులు, భోజనశాల, వంటశాల తదితర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, పౌష్టికాహారాన్ని అందించాలని, వంటశాల, భోజనశాల పరిసరాల్లో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతా విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం పై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థాయికి ఎదిగేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని తెలిపారు. పాఠశాల, జూనియర్ కళాశాల నిర్వహణకు సంబంధించిన అంశాలను సంబంధిత అధికారులతో సమీక్షించి, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు.ఈ సందర్భన లో నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, డిటిడివో నారాయణ రెడ్డి, తహసిల్దార్ ఎంపీడీవో ,నెక్కొండ తహసిల్దార్ రాజ్ కుమార్, డిఎస్డి ఓ హమీద్, సంబంధిత ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.



# బోనాల పాలారం బండి ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని

**యువత సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం అభినందనీయం**

**హనుమకొండ, మహా ;** కాజీపేట మహంకాళి బోనాల ఉత్సవాల్లో భాగంగా కాజీపేట లో నిర్వహించిన పాలారం బండి కార్యక్రమాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రత్యేక గుర్తింపు కలిగి ఉందన్నారు. యువత పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని మన సంస్కృతి, సంప్రదాయాలను పాటించడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు.తెలంగాణ పండుగలు, ఆచార వ్యవహారాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతోనిర్వహించు కోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

**సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ**

పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన 123 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.32 40,000 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. అనారోగ్యంతో చికిత్స పొందిన కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



## ట్రెసా రాష్ట్ర అధ్యక్షులుగా మొయినాబాద్ తహసిల్దార్ గౌతం కుమార్

**మొయినాబాద్ మహా:** ఆదివారం ముసరాంభాగ్ రెవెన్యూ భవన్ లో ట్రెసా మాజీ అధ్యక్షులు వంగ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులకు ఎన్నిక నిర్వహించ దానికి రాష్ట్ర కమిటీ సభ్యులు అలాగే మొత్తం (33) జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు మరియు సీసీఎల్ఏ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు అంతా సమావేశమై, చర్చించి ట్రెసా పూర్వ అధ్యక్షులు వంగ రవీందర్ రెడ్డి ఆగస్టు 31న పదవీ విరమణ అయిన నేపథ్యంలో గత (7) సంవత్సరాలుగా ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల తహసిల్దార్ కె. గౌతమ్ కుమార్ ను నూతన రాష్ట్ర అధ్యక్షులుగా అలాగే నిజామాబాద్ జిల్లా అధ్యక్షులుగా సుదీర్ఘకాలం సేవలందిస్తున్న ఎల్. రమన్ రెడ్డిని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షులు కె. గౌతమ్ కుమార్ మరియు ప్రధాన కార్యదర్శి ఎల్. రమన్ రెడ్డిలు మాట్లాడుతూ తమను ఎన్నుకున్నందుకు రాష్ట్ర పూర్వ అధ్యక్షులు వంగ రవీందర్ రెడ్డికి మరియు ట్రెసా కార్యవర్గ సభ్యులందరికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమకు అప్పగించిన బాధ్యతలను నెరవేర్చడానికి చిత్తశుద్ధితో పనిచేస్తామని,రెవెన్యూ అసోసియేషన్ కీర్తి, ప్రతిష్టలను మరింత పెంచుతామని అలాగే రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం పాటు పడతామని, రెవెన్యూ శాఖ ఉన్నతికి పాటుపడుతూ, ప్రభుత్వం అందించే సంక్షేమఫలాలను ప్రజలకు చేరవేయడానికి అలాగే రెవెన్యూ సేవలు సకాలంలో అందేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ట్రెసా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ లో శాశ్వత సభ్యత్వం కలిగి గుర్తింపు పొందిన సంఘంగా ఉద్యోగుల జేఏసీలో కీలక సంఘంగా ఉంది. ఈ సందర్భంగా ట్రెసా పూర్వ అధ్యక్షులు వంగ రవీందర్ రెడ్డిని గౌరవ అధ్యక్షులుగా ట్రెసా కార్యవర్గం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి. రాజ్ కుమార్, ఎండీ రియాజుద్దీన్, కోశాధికారి బి. వెంకటేశ్వర్ రావు, ఉపాధ్యక్షులు నిరంజన్ రావు,సీఎల్బి శాస్త్రి,మనోహర్ చక్రవర్తి,రాష్ట్ర సమన్వయ కర్త ఎం. నారాయణ రెడ్డి,స్పోర్ట్స్ & కల్చరల్ సెక్రటరీ జి. దేశ్య నాయక్, కార్యదర్శులు జగన్ మోహన్ రెడ్డి, కృష్ణ చైతన్య, చంద్ర శేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు బొమ్మ రాములు,వెంకటేశ్వర్లు,నజీమ్ ఖాన్, సంయుక్త కార్యదర్శులు కిషన్ నాయక్, బి. కృష్ణయ్య, బి. జయరాం, విక్రమ్ అలాగే సీసీఎల్ఏ యూనిట్ అధ్యక్షులు మూర్తుజా,ట్రెసా మాజీ నాయకులు రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్లు మన్నె ప్రభాకర్, ఎల్లారెడ్డి మరియు అంజిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే (33) జిల్లాల అధ్యక్ష,కార్యదర్శులు మరియు పెద్ద ఎత్తున రెవెన్యూ ఉద్యోగులు హాజరై నూతన అధ్యక్ష కార్యదర్శులను గజమాలలతో సన్మానించి,డప్పు వాయిద్యాలతో అలాగే బాణాసంచా కాల్చి ఆనందోత్సాహాలతో సంబరాలు చేసుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- **పేదల సేవకే గంట రవికుమార్ ఫౌండేషన్ అంకితం**
- **ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంట రవికుమార్**

వరంగల్, శివనగర్ మహా ; వరంగల్ నగరంలోని శివనగర్ లో శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో, గంట రవికుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఓ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి శస్త్రచికిత్స, వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ.. పేదల కళ్లల్లో ఆనందాల వెలుగుల కోసం శివనగర్‌లో ఉచిత కంటి శస్త్రచికిత్స శిబిరం., సమాజంలో నిరుపేదలకు, వెనుకబడిన వర్గాలకు అండగా నిలవడమే తమ ఫౌండేషన్ యొక్క ముఖ్య ఉద్దేశ్యమని స్పష్టం చేశారు. ఆరోగ్యకరమైన చూపే మనిషి జీవితానికి అత్యంత ప్రధానమైనది. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎంతోమంది పేదలు కంటి సమస్యలతో బాధపడుతున్నారని, వారి కోసం ప్రముఖ శంకర కంటి ఆసుపత్రి నిపుణులైన వైద్యుల సహాయంతో ఈ ఉచిత కంటి వైద్య, శస్త్రచికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయడంతో పాటు, ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు కూడా చేయించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో శివనగర్ ప్రాంతా ప్రజలు, వృద్ధులు ఈ ఉచిత కంటి చికిత్స శిబిరాన్ని సుమారు 1067 మంది కంటి పరీక్షలకు హాజరు కాగా, 722 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లుగా, శస్త్ర చికిత్స కోసం 42 మంది హైదరాబాద్‌కి బయలు దేరుతున్నట్లుగా గంట రవికుమార్ తెలిపారు.ఈ ఫౌండేషన్ ద్వారా గతంలో చేసిన అనేక సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో శంకర కంటి ఆసుపత్రి వైద్య బృందం, బిజెపి రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ, స్థానిక బిజెపి నాయకులు బైరి శ్యాంసుందర్, మార్త ఉషారాణి, వైట్ల గణేష్, తాళ్ళపెల్లి శ్రీను, సుంచు కేశవ్, మాదాసు రాజు, శివ శంకర్, సూరజ్, స్రవంతి, సాగరిక, రమేష్, శ్రీను, కల్పన, గంట రవికుమార్ ఫౌండేషన్ సభ్యులు, పోశాల సతీష్, కందుకూరి విజయ్ కుమార్, శ్రీనివాస్, సురేష్, విక్రమ్ గౌడ్, సునీల్, వేణు, రాజు, శ్రీకాంత్, రంజిత్, సందీప్,శ్రవణ్, రాజ్ కుమార్, నాగరాజు, వెంకట్, రాజు, భాస్కర్, సంతోష్, బిజెపి జిల్లా నాయకులు కనుకుంట్ల రంజిత్, బైరి నాగరాజు, కర్నె రవీందర్, అనిల్ గోగికర్, గోకే వెంకటేష్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# సముద్రంలో 'మండాడి' యాక్షన్

తమిళ నటుడు సూరి, టాలీవుడ్ యంగ్ టాలెంట్ సుహాస్ కాంబినేషన్‌లో తెరకెక్కిన ఇంటెన్స్ యాక్షన్ డ్రామా 'మండాడి'. తమిళనాడులో ప్రసిద్ధి చెందిన బోట్ రేసింగ్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రానికి మతిమారన్ పుగళేంది దర్శకత్వం వహించారు. సముద్రం నడిబొడ్డున ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ చిత్రీకరించిన ఈ సినిమా సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పలువురు టాలీవుడ్ ప్రముఖులు పాల్గొని సందడి చేశారు. నిర్మాత ఎల్రెడ్ కుమార్ మాట్లాడుతూ.. సినిమా కోసం భారీగా ఖర్చు చేశామని, మైత్రీ మూవీ మేకర్స్ అధినేత నవీన్ స్వయంగా ఫోన్ చేసి సహాయం చేస్తానని చెప్పడం గొప్ప విషయమని అన్నారు. సినిమా ఓటీటీ డీల్ క్లోజ్ కావడంలో నవీన్ అందించిన సహకారం మరువలేనిదని తెలిపారు. 'హిట్' దర్శకుడు శైలేష్ కొలను మాట్లాడుతూ.. సముద్రంలో ఒక్క పడవ షాట్ తీయడమే ఎంతో కష్టమని, అలాంటిది సినిమా మొత్తాన్ని సముద్రంలో చిత్రీకరించడం సాధారణ విషయం కాదన్నారు. ఈ విషయంలో చిత్రబృందాన్ని అభినందించారు. ముఖ్య అతిథిగా హాజరైన దర్శకుడు శివ నిర్వాణ మాట్లాడుతూ.. సినిమా కంటెంట్ చాలా గ్రాండ్‌గా ఉందని, భవిష్యత్తులో 'మండాడి'కి ప్రతిష్టాత్మక అవార్డులు దక్కడం ఖాయమని అన్నారు. హీరో సుహాస్ మాట్లాడుతూ.. మహిమా నంబియార్, రవీంద్ర విజయ్, సూరి నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చెప్పారు. సెప్టెంబర్ 10న కొత్త తరహా కంటెంట్‌ను చూసేందుకు ప్రేక్షకులు సిద్ధంగా ఉండాలని కోరారు. తమిళ హీరో సూరి తనదైన శైలిలో మాట్లాడుతూ.. "ఈ సారికి నన్ను వదిలేయండి.. వచ్చే సారి కచ్చితంగా తెలుగులో మాట్లాడతా" అంటూ నవ్వులు పూయించారు. సుహాస్‌తో కలిసి పనిచేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.నటుడు రవీంద్ర విజయ్ మాట్లాడుతూ.. స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందిన 'మండాడి' తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన ఈ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# నాని రూట్ మార్చారా?

నేచురల్ స్టార్ నాని సినిమాలకు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. కథ, పాత్ర, నటనకు ప్రాధాన్యం ఇస్తూ వరుస విజయాలను అందుకుంటున్న ఆయన.. ఇప్పుడు తన సినిమాల విషయంలో మరింత భారీ స్కేల్‌ను ఎంచుకుంటున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా 'ది ప్యారడైజ్' విషయంలో కథా నేపథ్యం, నిర్మాణ స్థాయి, ప్రమోషన్ విధానం చూస్తే నాని ఈసారి పెద్ద టార్గెట్‌తోనే ముందుకు వెళ్తున్నట్లు అర్థమవుతోంది. దీంతో నాని తన సినిమాల ఫార్ములాను మార్చారా? అనే చర్చ మొదలైంది.

**భారీ స్థాయిలో 'ది ప్యారడైజ్'**

నాని ఇప్పటివరకు కథలో వైవిధ్యానికి ప్రాధాన్యం ఇస్తూ సినిమాలు చేస్తూ వచ్చారు. కమర్షియల్ అంశాలను జోడిస్తూనే కొత్త కథలను ఎంచుకోవడం ఆయన ప్రత్యేకత. అయితే 'ది ప్యారడైజ్' మాత్రం గత చిత్రాలతో పోలిస్తే మరింత భారీగా రూపొందుతున్నట్లు తెలుస్తోంది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ డ్రామాపై 'దసరా' తర్వాత నుంచే అంచనాలు పెరిగాయి. దీంతో ఈ కాంబినేషన్‌లో రాబోతున్న రెండో చిత్రంపై ఆసక్తి నెలకొంది.

**పాన్ ఇండియా దిశగా అడుగులు**

'ది ప్యారడైజ్' విషయంలో నాని తెలుగు మార్కెట్‌కే పరిమితం కాకుండా ఇతర భాషల ప్రేక్షకులను కూడా టార్గెట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో సినిమాను ప్రమోట్ చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు సమాచారం. వివిధ భాషల ప్రేక్షకులకు కథ, పాత్రలను పరిచయం చేసేలా ప్రచార కార్యక్రమాలపై దృష్టి పెడుతున్నారని తెలుస్తోంది. దీంతో నాని తన మార్కెట్‌ను ఇతర భాషల్లోనూ విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నారా? అనే చర్చ జరుగుతోంది.

**అనిరుధ్ సంగీతంతో మరింత బజ్**

ఇప్పటికే 'ది ప్యారడైజ్' నుంచి విడుదలైన పాటలకు మంచి స్పందన రావడంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. దీనికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌కు అనిరుధ్ సంగీతం అదనపు ఆకర్షణగా మారింది. సినిమా విడుదలకు ముందే పాటలు, ప్రమోషనల్ కంటెంట్ ద్వారా మంచి బజ్ ఏర్పడుతోంది.

**కెరీర్‌కు గేమ్ ఛేంజరా?**

'ది ప్యారడైజ్' విజయం సాధిస్తే నాని మార్కెట్ మరింత విస్తరించే అవకాశం ఉంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర భాషల్లోనూ తన సినిమాలకు స్థిరమైన ప్రేక్షకాదరణ తీసుకురావడానికి ఈ చిత్రం ఉపయోగపడొచ్చు. అయితే పాన్ ఇండియా స్థాయిలో విజయం సాధించాలంటే కేవలం పలు భాషల్లో విడుదల చేయడం సరిపోదు. కథ, పాత్రలు, మేకింగ్, ప్రమోషన్.. అన్ని అంశాలు ఆ స్థాయిలో ఉండాలి.'ది ప్యారడైజ్' విషయంలో నాని ఎంచుకున్న స్కేల్‌ను పరిశీలిస్తే ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. తనకు అలవాటైన కథల ఎంపికను కొనసాగిస్తూనే వాటిని మరింత భారీ స్థాయిలో చూపించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా అంచనాలను అందుకుంటే నాని మార్కెట్, సినిమాల స్కేల్ రెండూ కొత్త స్థాయికి చేరే అవకాశం ఉంది. అదే జరిగితే 'ది ప్యారడైజ్' ఆయన కెరీర్‌లో కీలకమైన గేమ్ ఛేంజర్‌గా నిలిచే అవకాశాలు ఉన్నాయి.



# చీరలో శ్రుద్ధా దాస్ అందాల సందడి

టాలీవుడ్ నటి శ్రద్ధా దాస్ మరోసారి తన అందం, స్టైల్‌తో అభిమానులను ఆకట్టుకుంది. లేత గ్రే, వైట్ కలర్ చెక్ డిజైన్ ఉన్న చీరలో సంప్రదాయ అందానికి ఆధునిక హంగులను జోడించి మెరిసింది. దీనికి నేవీ బ్లూ రంగు స్లీవ్‌లెస్ బ్లౌజ్‌ను జతచేసి ఎంతో స్టైలిష్‌గా కనిపించింది. పుస్తకాల అల్మారా పక్కన నిల్చొని, ఒక చేతిని మెడ సమీపంలో ఉంచి పక్కకు చూస్తున్న ఆమె పోజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. షార్ట్ వేవీ హెయిర్, సిల్వర్ ఇయర్‌రింగ్స్‌తో శ్రద్ధా లుక్ మరింత ఎలిగెంట్‌గా కనిపించింది. ఈ ఫొటోను సోషల్ మీడియాలో పంచుకున్న ఆమె.. 'మీకు నేను చీరలో నచ్చుతాను కాబట్టి..' అంటూ సరదాగా క్యాప్షన్ ఇచ్చింది. దీంతో ఈ ఫొటోలు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.శ్రద్ధా దాస్ 2008లో విడుదలైన 'సిద్దు ఫ్రమ్ సికాకులం' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టింది. తొలి చిత్రంతోనే నటిగా గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. ఆ తర్వాత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ విభిన్న పాత్రల్లో నటించింది. అల్లు అర్జున్, కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్రల్లో నటించిన 'ఆర్య 2'లో కీలక పాత్ర పోషించి మరింత గుర్తింపు సంపాదించింది. అనంతరం హిందీలో తెరకెక్కిన జాతీయ అవార్డు గెలుచుకున్న 'లాహోర్' చిత్రంలోనూ నటించి తన పరిధిని విస్తరించింది.తెలుగులో 'డార్లింగ్', 'నాగవల్లి', 'పారిజాత పర్వం' వంటి చిత్రాల్లో శ్రద్ధా దాస్ కనిపించింది. హిందీలో 'దిల్ తో బచ్చా హై జీ', 'గ్రేట్ గ్రాండ్ మస్తీ' వంటి సినిమాల్లోనూ నటించింది. భాషకు పరిమితం కాకుండా కన్నడ, బెంగాలీ తదితర సినీ పరిశ్రమల్లోనూ తన నటనను పరిచయం చేసింది. 'కొటిగొబ్బ 3' వంటి కన్నడ చిత్రాల్లోనూ నటించి ప్రేక్షకులను అలరించింది. గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను కూడా ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది.ప్రస్తుతం వెండితెరతో పాటు డిజిటల్ వేదికపైనా శ్రద్ధా దాస్ తన సత్తా చాటుతోంది. ఇటీవల 'సెర్చ్: ది నైనా మర్డర్ కేస్', 'ఖాకీ: ది బెంగాల్ చాప్టర్' వంటి ఓటీటీ సిరీస్‌లలో నటించి మెప్పించింది. విభిన్న కథలు, పాత్రలను ఎంచుకుంటూ డిజిటల్ ప్రేక్షకులకు కూడా దగ్గరవుతోంది. దీంతో సినిమాలు, వెబ్ సిరీస్‌లలో వరుస అవకాశాలతో శ్రద్ధా దాస్ కెరీర్‌ను కొనసాగిస్తోంది.ప్రస్తుతం శ్రద్ధా దాస్ పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులతో బిజీగా ఉంది. 'లేచింది మహిళా లోకం', 'త్రికాల - స్క్రిప్ట్ ఆఫ్ గాడ్' వంటి చిత్రాలు 2026లో ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. 'అర్థం'తో పాటు ప్రముఖ నటుడు మనోజ్ బాజ్‌పేయితో కలిసి నటిస్తున్న ఓ చిత్రంలోనూ ఆమె భాగమవుతోంది. నటనతో పాటు తన స్టైలిష్ లుక్స్, ఫ్యాషన్ ఫొటోషూట్లతోనూ సోషల్ మీడియాలో శ్రద్ధా దాస్ ఎప్పటికప్పుడు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. సంప్రదాయ చీరలో అయినా, మోడ్రన్ అవుట్‌ఫిట్‌లో అయినా తనదైన శైలితో కనిపిస్తూ అభిమానులను అలరిస్తోంది.





# కొత్త సవాళ్లతో బిగ్‌బాస్-10

బుల్లితెరపై భారీ ఆదరణ పొందుతున్న రియాలిటీ షో 'బిగ్‌బాస్' పదో సీజన్ గ్రాండ్‌గా ప్రారంభం కానుంది. సీజన్ ప్రారంభానికి ముందు విడుదల చేసిన ప్రోమో ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచింది. హోస్ట్ నాగార్జున తనదైన స్టైల్‌లో తెరపైకి వచ్చి ఈసారి ఆట సాధారణంగా ఉండదనే సంకేతాలను ఇచ్చారు. పదో సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని 'దశావతారం' పేరుతో ప్రత్యేక కాన్సెప్ట్‌ను రూపొందించినట్లు ప్రోమో ద్వారా వెల్లడైంది. దీంతో ఈ సీజన్‌లో ఎలాంటి టాస్కులు, ట్విస్టులు ఉండబోతున్నాయనే ఉత్కంఠ మొదలైంది. ప్రోమోలో మరో ఆసక్తికరమైన అంశం కూడా చోటుచేసుకుంది. వివిధ భాషల్లో బిగ్‌బాస్ షోలకు వ్యాఖ్యాతలుగా వ్యవహరిస్తున్న విజయ్ సేతుపతి, మోహన్‌లాల్, సుదీప్‌లతో నాగార్జున డిజిటల్ వేదికగా ముచ్చటించారు. ఈ సందర్భంగా నాలుగు భాషల షోలకు సంబంధించిన విషయాలను ప్రస్తావిస్తూ సరదా సంభాషణ సాగింది.

**సినీ సందడి కూడా..**


గ్రాండ్ లాంచ్ కార్యక్రమంలో పలువురు సినీ ప్రముఖులు సందడి చేయనున్నారు. తమిళ హీరో కార్తీ తన తాజా చిత్రం 'సర్దార్ 2' ప్రచార కార్యక్రమంలో భాగంగా బిగ్‌బాస్ వేదికపై కనిపించనున్నారు. మరోవైపు యువ కథానాయకుడు ఆనంద్ దేవరకొండ తన 'ఎపిక్' సినిమా బృందంతో కలిసి కార్యక్రమంలో పాల్గొని నాగార్జునతో సందడి చేయనున్నట్లు తెలుస్తోంది.

**16 మంది కంటెస్టెంట్లు..**

ఈ సీజన్‌లో మొత్తం 16 మంది కంటెస్టెంట్లు బిగ్‌బాస్ హౌస్‌లోకి అడుగుపెట్టనున్నట్లు సమాచారం. వీరిలో 10 మంది ప్రముఖులు కాగా, మరో ఆరుగురు సాధారణ వ్యక్తుల నుంచి ఎంపికయ్యారు. ప్రచారంలో ఉన్న వివరాల ప్రకారం ఆటో రాంప్రసాద్, టెంపర్ వంశీ, దేబ్జానీ మోదక్, యాంకర్ వర్షిణి, ముఖేష్ గౌడ, చైత్రా రాయ్, నటుడు కృష్ణుడు, జబర్దస్త్ నరేశ్, యాంకర్ సుధీర్ రెడ్డి తదితరులు సెలబ్రిటీ కంటెస్టెంట్ల జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది.

**'అగ్ని పరీక్ష' ద్వారా..**

సామాన్యుల విభాగంలోకి వచ్చే ఆరుగురిని ప్రత్యేకంగా నిర్వహించిన 'అగ్ని పరీక్ష' ప్రక్రియ ద్వారా ఎంపిక చేసినట్లు సమాచారం. ఈ ఎంపికలో ఝాన్సీ ఇప్పటికే 'టికెట్ టు బిగ్‌బాస్ హౌస్'ను సొంతం చేసుకుని ఫినాలే రౌండ్‌లో విజయం సాధించినట్లు తెలుస్తోంది. ఆమెతో పాటు రోహిత్ నాయుడు, శ్రష్టి, చరణ్, అమన్ మసూద్, షాలిని పటేల్ హౌస్‌లోకి ప్రవేశించనున్నారని సమాచారం.తెలుగు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న బిగ్‌బాస్ తెలుగు సీజన్ 10 ప్రారంభ ఎపిసోడ్ నేడు సాయంత్రం 7 గంటలకు ప్రసారం కానుంది. టెలివిజన్‌లో 'స్టార్ మా'తో పాటు 'జియో హాట్‌స్టార్'లోనూ వీక్షించే అవకాశం ఉంది. భిన్నమైన నేపథ్యాల నుంచి వచ్చిన కంటెస్టెంట్లు ఒకే ఇంట్లో ఉండటం, కొత్త తరహా టాస్కులు, అనూహ్య పరిణామాలు ఈ సీజన్‌కు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. పదో సీజన్ కావడంతో నిర్వాహకులు ప్రత్యేకంగా రూపొందించిన కాన్సెప్ట్ ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని అందిస్తుందో చూడాలి.



# మాస్ వారసత్వంలోకి మాధవ్

టాలీవుడ్‌లో మాస్ మహారాజా రవితేజ తనదైన బాడీ లాంగ్వేజ్, ఎనర్జీ, డైలాగ్ డెలివరీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఆయన కుటుంబం నుంచి మరో యువ నటుడు మాధవ్ భూపతిరాజు సినీ రంగంలోకి అడుగుపెడుతున్నారు. రవితేజ సోదరుడు రఘు రాజు కుమారుడైన మాధవ్ హీరోగా నటించిన తొలి చిత్రం 'మారెమ్మ' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల విడుదలైన ట్రైలర్ మాధవ్ నటనపై ఆసక్తిని పెంచింది.'మారెమ్మ' ప్రీ రిలీజ్ కార్యక్రమానికి రవితేజ ముఖ్య అతిథిగా హాజరై మాధవ్‌ను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడిన విధానం, బాడీ లాంగ్వేజ్, కాన్ఫిడెన్స్ అభిమానులను ఆకట్టుకున్నాయి. అతడి హావభావాల్లో రవితేజ మాస్ ఛాయలు కనిపిస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీంతో రవితేజ తరహాలో మాధవ్ కూడా మాస్ పాత్రలతో తనకంటూ ప్రత్యేక ఇమేజ్ సంపాదించుకుంటాడా అనే ఆసక్తి నెలకొంది.తొలి చిత్రానికే రూటెడ్, రస్టిక్ నేపథ్యాన్ని ఎంచుకోవడం మాధవ్‌పై అంచనాలను పెంచుతోంది. 'మారెమ్మ' విజయం అతడి భవిష్యత్ కెరీర్‌కు కీలకంగా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం కథ, కంటెంట్‌కు ప్రాధాన్యం ఇస్తున్న యువ హీరోలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో మాధవ్ తన నటనతో ఎంతవరకు మెప్పిస్తాడన్నది ఆసక్తికరంగా మారింది. రవితేజ ఆశీస్సులతో మాస్ లుక్, ఎనర్జీతో పరిచయమవుతున్న మాధవ్ 'మారెమ్మ'తో ప్రేక్షకులపై ఎలాంటి ప్రభావం చూపిస్తాడో, బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటాడో చూడాలి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com